ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట
● కోటప్పకొండ మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షలో మంత్రి ఆనం

6

సివిల్ జడ్జిలకు పదోన్నతిపై బదిలీలు

పురుగుల మందు తాగి కుమారుడు.. ఉరేసుకుని తల్లి
ఇద్దరూ ఆత్మహత్య



● కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

# కిమ్స్ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

● గుంటూరులో ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల కిందట నెల్లూరులో ఆస్పత్రి ఏర్పాటు ద్వారా వైద్యరంగంలో తన ప్రస్థానం ప్రారంభించిన కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ నేడు ఐదు రాష్ట్రాలకు విస్తరించి ఐదు వేల పడకలతో రోగులకు విస్తృత స్థాయిలో సేవలు అందించడం ప్రశంసనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళదాస్‌నగర్ సమీపంలో 200 పడకలతో నిర్మించిన కిమ్స్ శిఖర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను బుధవారం సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో కిమ్స్ ఆస్పత్రులు రోగులకు చక్కటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ఆస్పత్రిలో పని చేసే ఉద్యోగులకు షేర్ ఇచ్చారని తెలిపారు. పది వేల మంది ఉద్యోగులు పెట్టుబడులు పెట్టారని చెప్పారు. సంస్థ బాగుండాలంటే అందులో పని చేసే ఉద్యోగుల భాగస్వామ్యం అవసరమేనన్నారు.

**అమరావతిలో వెయ్యి పడకలతో ఆస్పత్రి..**

రాజధాని అమరావతిలో త్వరలో వెయ్యి పడకలతో అత్యాధునిక ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ బొల్లినేని భాస్కరరావు తెలిపారు. గుంటూరులోని హాస్పిటల్‌ను త్వరలో 500 పడకల సామర్థ్యానికి పెంచుతామన్నారు. విజయవాడలో కూడా అత్యాధునిక వసతులతో 500 పడకలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్‌యాదవ్, పొంగూరు నారాయణ, కింజరావు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, కందుల లక్ష్మీదుర్గేశ్, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు, మాలకొండయ్య, దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ సజీల, ఆస్పత్రి సీఈవో డాక్టర్ బీ అభినయ్, వైద్యనిపుణులు డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, డాక్టర్ పీవీఎస్ హరిత, డాక్టర్ కొల్లి జయ కిషన్, డాక్టర్ వడ్లమూడి సుధీర్, డాక్టర్ మాలెంపాటి రాజశేఖర్, డాక్టర్ రావెళ్ల విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం దగ్గర సీఎం చంద్రబాబు, చైర్మన్ భాస్కరరావు తదితరులు

# పల్లె పండుగకు పైసలేవీ..!



సిమెంట్ రోడ్డు

**పల్లె పండుగ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగడంలేదు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికి రూ 83.06 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రహదారులు.. మురుగు కాలువల నిర్మాణం.. గోకులాలు, పాఠశాలల ప్రహారీల నిర్మాణం తదితర పనులు నిధుల లేమితో నిలిచిపోతున్నాయి. దీంతో పనులు పూర్తి చేసేందుకు పల్లె కమిటీలు ముందుకు రావడంలేదు. పథకం ప్రారంభం లో వారం.. వారం బిల్లుల చెల్లింపులు జరిగాయి. మొద టి రెండు వారాలు చెల్లింపులు సక్రమంగా జరగడంతో పెద్ద ఎత్తున పనులు చేపట్టారు. పూర్తి చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగక పోతుండటంతో పనులను నిలిపివేస్తున్నారు.**



గోకులం షెడ్

- బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం
- నిలిచిపోతున్న పనులు, నిర్మాణాలు
- రూ. 83.06 కోట్ల బకాయిలు
- రెండు నెలలుగా ఆగిన చెల్లింపులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కనీసం రోడ్లు, మురుగుకాలువలు వంటి మౌలిక సదుపాయలు కల్పించపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న దారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రారంభంలో ప్రగతి పనులు పరుగులు తీశాయి. అయితే పూర్తి చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో పనులకు ఎక్కడకక్కడ నిలిపివేస్తున్నారు. గుంటూరు.. బాపట్ల.. పల్నాడు జిల్లాల్లో పల్లె పండుగలో భాగంగా చేపట్టిన పనుల్లో ఇప్పటికి 57.95 శాతం పనులు మాత్రమే పూర్తయినట్టు డ్వామా శాఖ లెక్కలు చెబుతున్నాయి.

పల్నాడు జిల్లాలో రూ 62.44 కోట్ల వ్యయంతో గ్రామాల్లో రహదారులు.. మురుగు కాలువలు.. స్కూల్స్ ప్రహరీల నిర్మాణం 524 పనులు చేపట్టగా ఇప్పటికి 350 పనులు పూర్తి చేశారు. 66.67 శాతం పనులు పూర్తయినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. బాపట్ల జిల్లాలో 644 పనులు 67.67 కోట్ల వ్యయంతో చేపట్టగా 447 పనులు పూర్తయ్యాయి. 61.91 శాతం పనులు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలో 170 పనులను రూ 14.54 కోట్ల వ్యయం తో చేపట్టగా ఇప్పటికి 77 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 45.29 శాతం పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టు విధానంలో కాకుండా నామినేషన్ నిర్వహిస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సూచించిన వ్యక్తుల చేత పనులు చేపట్టారు. ఈ విధానంలో దాదాపు 13 శాతం వరకు ప్రభుత్వానికి నిధులు ఆదా అవుతున్నాయి. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో నిర్వాహకులు అందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోకులాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టిన అనంతరం నాలుగు విడతలుగా బిల్లులు చెల్లించాలి. పిల్లర్, రూఫ్, ఫ్లోరింగ్, ఫినిషింగ్ దశల్లో బిల్లులు చెల్లించాల్సి ఉంది. లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు ఉపాధి పథకం కింద బిల్లుల మొత్తాన్ని జమ చేయాలి. సుమారు రెండు నెలలుగా ఉపాధి హామీ పథకం స్లాట్ విడుదల కావడంలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో పనులు చేయించిన రైతులు ఉపాధి హామీ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. బిల్లుల ఎప్పుడు చెల్లించేది స్పష్టంగా అధికారులు లబ్ధిదారులు చెప్పకపోతుండటంతో వారు అవేదనకు లోనవుతున్నారు. పశువుల షెడ్లకు లబ్ధిదారుడు 10 శాతం చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకందారులు వారి వాటా ధనం మొత్తం వ్యయంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. సొంత స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం కల్పించారు. ఇటీవల ప్రజా ప్రతినిధులు పూర్తయిన గోకులం షెడ్‌లను ఆర్భాటంగా ప్రారంభించారు. అయినా బిల్లుల చెల్లింపులు జరగడంలేదు.

పల్నాడు జిల్లాలో 714 గోకులాలు మంజూరు కాగా 672 షెడ్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 458 షెడ్ల నిర్మాణం పూర్తయింది. వీటిలో 243 షెడ్లను ప్రారంభించారు. బాపట్ల జిల్లాలో 683 గోకులాలు మంజూరు కాగా 681 షెడ్‌ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 405 షెడ్ల నిర్మాణం పూర్తయింది. 222 షెడ్లను ప్రారంభించారు. గుంటూరు జిల్లాలో 386 షెడ్ల మంజూరు కాగా 379 షెడ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 207 షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు. 67 షెడ్లను ప్రారంభించారు. మిగతా షెడ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ముందుగా చెప్పిన విధంగా విడతల వారీగా బిల్లులు చెల్లించకపోతుండటంతో షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు నిలిపివేస్తున్నారు. అధిక శాతం షెడ్లు 4 నుంచి ఆరు పశువుల యూనిట్ల నిర్మాణం చేపట్టారు. షెడ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. అప్పులు చేసి షెడ్‌లు నిర్మించుకున్నామని వెను వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. బిల్లుల చెల్లింపులలో జాప్యంపై పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తిని సంప్రదించగా, పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని రానున్న వారం రోజుల్లో బిల్లుల చెల్లింపు జరిగే అవకాశం ఉందని తెలిపారు.

ప్రగతి పనులు.. గోకులం షెడ్ల బకాయిలు జిల్లాల వారీగా..

| జిల్లా | రూ కోట్లలో |
|---|---|
| ● పల్నాడు | 41.90 |
| ● బాపట్ల | 34.12 |
| ● గుంటూరు | 10.04 |



● మురుగు కాలువల నిర్మాణం

# గడువులోపే రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి

● కంబైన్డ్ క్రూ లాబీలో సకల సదుపాయాలు ఉండాలి
● గుంటూరు రైల్వే డివిజన్ ఇన్‌స్పెక్షన్‌లో జీఎం అరుణ్‌కుమార్ జైన్

8



పొందుగల వద్ద కృష్ణానదిపై ఉన్న వంతెన మ్యాపును పరిశీలిస్తున్న జీఎం

# పల్నాడులో లెదర్‌పార్కు

వినుకొండ, మాచర్ల, నకరికల్లులో కొరియా నిపుణుల పర్యటన



వెంకుపాలెం సమీపంలో భూముల మ్యాపును పరిశీలిస్తున్న ప్రతినిధులు

8

# వలస పక్షులపై నిఘా

● బర్డ్ ఫ్లూ వదంతులతో పశుసంవర్ధకశాఖ అలెర్ట్ ● ఉప్పలపాడు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు ● సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసే అవకాశం ● ఉమ్మడి గుంటూరు జిల్లాలో కేసులు లేవన్న అధికారులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ వణికిస్తోంది. కోళ్లు పెద్దసంఖ్యలో చనిపోతున్నాయి. చికెన్ విక్రయాలపై అధికారులు నిషేధం విధించారు. కొన్ని జిల్లాల్లోని పలు ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల సరఫరాను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో చికెన్ విక్రయాలు దారుణంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తికి ప్రధాన వాహకంగా ఉన్న వలస పక్షులపై పశుసంవర్ధకశాఖ నిఘా వేసింది. వలస పక్షుల ద్వారా కూడా బర్డ్‌ఫ్లూ విస్తరించే అవకాశం ఉన్న నేపథ్యంలో గుంటూరు సమీపంలోని పక్షుల కేంద్రాన్ని పశుసంవర్ధకశాఖ అధికారులు బుధవారం ప్రత్యేకంగా పరిశీలించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు, జిల్లా వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల ఏడీ బి.మాధవి తదితరులు వలస పక్షుల ఆరోగ్యంపై ఆరాతీశారు. పక్షులు తాగే నీటి వనరులను పరిశీలించారు. అక్కడ ఉన్న పశుసంవర్ధక శాఖ అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. వలస పక్షుల లో అసహజ మరణాలు సంభవిస్తే వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం గుంటూరులోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవన్నారు. అలా అని నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పౌల్ట్రీలపై దృష్టి సారించాలన్నారు. అధికారులు పౌల్ట్రీలను సందర్శించి కోళ్ల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు అవసరమైతే జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొల్లేరుకు వచ్చిన వలస పక్షుల వల్లే ఆ ప్రాంతంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిందని, దాని ప్రభావం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ కేసులు లేవని ప్రకటించారు.

**తగ్గిన కొనుగోళ్లు**

గుంటూరు: పౌల్ట్రీ రంగాన్ని వణికిస్తున్న బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ ఉమ్మడి గుంటూరు జిల్లాపై ఎక్కడా లేదని, వదంతులను నమ్మొద్దని అధికారులు సూచిస్తున్నారు. బర్డ్ ఫ్లూ ప్రచారంతో చికెన్ వద్దంటూ ప్రజలు భయపడుతున్నారు. దాంతో కొనుగోళ్లు కూడా సగానికి పడిపోయినట్లు పౌల్ట్రీ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 2న ఆదివారం చికెన్ కిలో స్కిన్‌లెస్ రూ.250కు విక్రయించారు. బర్డ్ ఫ్లూ ప్రచారం ప్రభావంతో మొన్నటి ఆదివారం కిలో 200లకు పడిపోయింది. వారం వ్యవధిలోనే కిలోకు రూ.50 తగ్గి పోవడంతో వ్యాపారులు హైరానా పడుతున్నారు. గత నెలలో గరిష్ఠంగా కిలో రూ.270 వరకు విక్రయించగా ప్రస్తుతం చాలావరకు తగ్గిపోయింది అయినా కొనుగోళ్లు సగానికి సగం పడిపోయాయి.



ఉప్పలపాడు వలస పక్షుల కేంద్రాన్ని సందర్శించిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు తదితరులు

**దిగి వస్తోన్న గుడ్డు ధర..**

బర్డ్ ఫ్లూ ప్రచారం అంటుంచితే చికెన్‌తో పాటు కోడిగుడ్డు ధర కూడా దిగి వస్తోంది. గుడ్డు రూ.4.50లకు చేరుకుంది. హోల్‌సేల్‌లో డిసెంబరు, జనవరిలో గరిష్టంగా రూ.6ల వరకు విక్రయించారు.



# చీట్..ఫండ్స్

- బోర్డులు తిప్పేస్తోన్న సంస్థలు
- ఏడాదిలో నరసరావుపేటలో రెండు సంస్థల మూత
- కొరవడిన పర్యవేక్షణ.. రూ.కోట్లలో నష్టపోయిన మదుపరులు



సాయిసాధన చిట్ కార్యాలయానికి తాళాలు వేస్తున్న పోలీసులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అత్యవసర సమయాల్లో.. కష్టకాలంలో అక్కరకు వస్తాయని.. సామాన్యులు, మధ్యతరగతి జీవులు తినీతినక చిట్లు వేస్తుంటారు. ఇదే అవకాశంగా మాయమాటలతో, వడ్డీల ఆశతో రూ.కోట్లలో పోగేసుకుని చిట్ సంస్థలు ఒక్కొక్కటిగా బోర్డు తిప్పేస్తున్నాయి. ఒక్క నరసరావుపేటలోనే ఏడాది కాలంలో రెండు చిట్ సంస్థలు మూతపడ్డాయి. చిట్‌ల సంస్థల నిర్వహణలో నష్టాలురావు. అయినా మదుపరుల నుంచి చిట్ పేరుతో డబ్బు వసూలు చేసుకుని ఉడాయిస్తున్నారు. గతంలో నరసరావుపేటలో సిరి, నేడు సాయిసాధన చిట్ సంస్థలు బోర్డు లు తిప్పేయగా చిట్ సభ్యులు దారుణంగా మోసపోయారు. రిజిష్టర్డు చిట్ సంస్థలుగా ఉన్న వీటిపై రిజిస్ట్రేషన్ శాఖ పర్యవేక్షణ లేదు. చిట్ సంస్థల నిర్వహణకు కఠినమైన చట్టం ఉన్నా దానిని అమలు చేయడం లేదు. అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కు కావడంతో మదుపరులను నిర్వాహకులు మోసగిస్తున్నారు.



**నిబంధనలు ఇలా..**

రిజిష్టర్డు సంస్థలు రూ.10 లక్షల చిట్ నిర్వహిస్తే చట్టప్రకారం (మిగతా 6వ పేజీలో)



నరసరావుపేటలో సాయిసాధన బాధితుల అందోళన

**వందల్లో సాయిసాధన బాధితులు**

సాయిసాధన చిట్ సంస్థ నిర్వహకుడు పాలడుగు పుల్లారావు వందలాది మంది సభ్యులను రూ.కోట్లలో మోసగించాడు. గుంటూరు, నరసరావుపేట పోలీసు స్టేషన్లలో బాధితుల ఫిర్యాదుల మేరకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో పుల్లారావు లొంగిపోగా ఈ నెల 21 వరకు రిమాండ్ విధించారు. ప్రాథమికంగా తేల్చిన లెక్కల ప్రకారం 323 మంది నుంచి రూ.103,95,49,582 డిపాజిట్లు ఉన్నాయి. వీరు కాక మోసపోయిన చిట్ సభ్యులు కూడా వందల్లో ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. పుల్లారావు భార్య కూడా సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నారు. 2021 నుంచి పథకం ప్రకారం డిపాజిట్లు స్వీకరిచడంతో పాటు.. అక్రమంగా చిట్లు నిర్వహించి మోసగించినట్లు పోలీసుల విచారణలో తేలింది. బాధితులు గత వారం రోజులుగా వివిధ రూపాల్లో అందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. పుల్లారావుతో పాటు ఆయన కుటుంబసభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల, బంగారు వస్తువులు విక్రయించి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను బాధితులు కోరుతున్నారు.

# సివిల్ జడ్జిలకు పదోన్నతిపై బదిలీలు

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు కోర్టులలో పనిచేస్తున్న సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)లకు పదోన్నతి కల్పించి మరో కోర్టు లో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)లు గా నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) గా పనిచేస్తున్న మహమ్మద్ ఇషత్ ఫాతిమాను పదోన్నతిపై ఇక్కడే ఖాళీగా ఉన్న రెండో అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)గా (ఫాస్ట్ ట్రాక్ కోర్టు) నియమించారు. విజయవాడలోని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పనిచేస్తున్న సయ్యద్ జియావుద్దీన్ ను పదోన్నతిపై గుంటూరులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. మంగళగిరిలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న సీహెచ్.వి.రామకృష్ణను పదోన్నతిపై ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. కడప జిల్లా కమలాపురంలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న నక్కా లావణ్యను పదోన్నతిపై నరసరావుపేటలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. అక్కడ పని చేస్తున్న కె.మధుస్వామిని నర్సరావుపేటలోనే ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వి.విజయ్ కుమార్ రెడ్డిని పదోన్నతి పై సత్తెనపల్లిలో సీనియర్ సివిల్ జడ్జిగా ( ఖాళీగా ఉంది) నియమించారు. మంగళగిరిలోని జ్యుడీషియల్ అకాడమీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి వి.సత్యలక్ష్మీ ప్రసన్నను పదోన్నతిపై నందిగామలో సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. పదోన్నతిపై బదిలీ అయిన న్యాయమూర్తులు ఈ నెల 24 లోపు కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు.

# చనిపోయిన వారూ.. ఉపాధి పనులకు హాజరు!


పంచాయతీ జారీ చేసిన మరణ ధ్రువీకరణ పత్రం

చుండూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాళ్లు 7-8 సంవత్సరాల క్రితం చనిపోయారు. అయితే ఉపాధి హామీ అధికారులు గతేడాది ఉపాధి హామీ పథకం పనులు కోసం తిరిగి వాళ్లని భూమి మీదుకు తీసుకొచ్చారు. ఈ సంఘటన కార్మూరువారిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కంచర్ల జగ్గయ్య (55) ఏప్రిల్ 8, 2016లో చనిపోయారు. గ్రామ పంచాయతీ డిసెంబరు 3, 2016న మరణ ధ్రువీకరణ పత్రం కూడా జారీ చేసింది. ఈ మృతుడు గతేడాది వంద రోజుల పాటు గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్నట్లు రికార్డుల్లో ఉంది. అదేవిధంగా ముత్యాల అమర్తయ్య (60) ఆగస్టు 10, 2021లో మరణించాడు. ఆగస్టు 27, 2021 గ్రామ పంచాయతీ మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చింది. అలాగే పచ్చా కామేశ్వరరావు 2022 జూలై 7న మరణించాడు. అధికారులు వీరికి ప్రాణం పోసి ఉపాధి పనుల్లో పెట్టుకున్నారు. చనిపోయిన వారికి, విదేశాల్లో ఉంటున్న వారికి అధికారులు ఉపాధి పనుల్లో హాజరు వేశారు. 10 ఏళ్లుగా దుబాయ్ లో ఉంటున్న గ్రామానికి చెందిన ముత్యాల మస్తాన్‌రావు ఇక్కడి ఉపాధి పనుల్లో ఉన్నట్లు రికార్డులో ఉంది. జబ్బు పడి, మోకాళ్ల అరిగి నడవలేక మంచానికే పరిమితమైన వారు కూడా రెండు, మూడు నెలలు ఉపాధి పనులు చేసినట్లు రికార్డులకెక్కారు. వివిధ వృత్తులు చేసుకుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఈ గ్రామానికి చెందిన మరో 15 మంది కూడా ఇక్కడి ఉపాధి పనులు చేసినట్లు రికార్డుల్లోకి ఎక్కారు. కార్మూరువారిపాలెం మైనర్ పంచాయతీ. 800 జనాభా. ఈ చిన్న గ్రామంలో గత ఐదేళ్లలో లక్షలాది రూపాయల ఉపాధి హామీ పనుల్లో గోల్‌మాల్ జరిగింది. గత ప్రభుత్వంలో అధికారులు, నాయకులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారు. ఈ దోపిడీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.





# ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట

● కోటప్పకొండ మహాశివరాత్రి ఏర్పాట్లుపై సమీక్షా సమావేశంలో మంత్రి ఆనం


సమావేశంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేసి, ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శనమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సచివాలయంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన కోటప్పకొండ మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉండటం వలన కోటప్పకొండలో భౌతికంగా సమావేశం నిర్వహించకుండా సచివాలయంలో సమీక్ష నిర్వహించామన్నారు. కోటప్పకొండలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తుల భద్రత, వసతులు, ట్రాఫిక్ నిర్వహణ, అన్నదానం, వైద్య సదుపాయాలు, పండగ ఏర్పాట్లపై పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలకు సూచనలు ఇచ్చారు. తాగునీటి, వైద్య సహాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అదనపు పోలీసు బలగాలతో భద్రతా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా, వీఐపీల రాకపోకలు సజావుగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి పదేళ్లుగా పోరాటాలు చేస్తున్నప్పటికీ, సమస్యలు అంతంత మాత్రంగానే పరిష్కారం అయ్యాయని, సకల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉన్నతాధికారులతో కమిటీని వేసి కార్యాచరణ ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పల్నాడు జిల్లా అమరావతి మండలం ధరణికోట గ్రామంలోని జేబీ కల్యాణ మండపంలో నిర్వహించిన అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశానికి ముప్పాళ్ల ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ కస్టమర్స్‌ను నమ్మించి రూ. 6,365 కోట్లు డిపాజిట్లు సేకరించి, ఆ సొమ్మును కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీదారుల పేరు మీద పెట్టుకుని కస్టమర్లను వేధిస్తున్నారని అన్నారు. తాము చేస్తున్న పోరాటాల వలన అగ్రిగోల్డ్ యాజమాన్యం నుంచి వేలాది ఎకరాల భూమి, లక్షలాది చదరపు గజాల స్థలాలు, పలు రకాల కంపెనీలు, భవంతులు, హాయ్‌ల్యాండ్ నుంచి యారాడ రిస్సార్ట్ వరకు ప్రభుత్వంచే అటాచ్‌మెంట్ చేయించినట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి హయాంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి కొంతమేర నెరవేర్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. గత ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తాము అధికారంలోకి రాగానే బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా, బాధితులకు ఎలాంటి ఫలితం దక్కలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ నాయుడు, ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, రైతు సంఘ నాయకులు ప్రసాద్, చంద్రశేఖర్, వివిధ జిల్లాల అధ్యక్షులు, అగ్రిగోల్డ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# భూ సమీకరణ పద్ధతిలో మా భూములు ఇస్తాం

● రైల్వేలైన్ బాధిత రైతుల ఉమ్మడి నిర్ణయం


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్రం ఖమ్మం సమీపంలోని ఎర్రుపాలెం నుంచి రాజధాని అమరావతి మీదుగా నంబూరు వరకు సుమారు 53 కి.మీ రైల్వేలైను నిర్మాణానికి సంబంధించి పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని మూడు గ్రామాల పరిధిలో సేకరించాల్సిన 330 ఎకరాలకు సంబంధించి అభ్యంతరాలు తెలిపిన రైతులతో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టు పక్కనే ఉన్న హరిత రిసార్ట్‌లో మూడు గ్రామాల రైతులతో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చయ్య, ఆర్డీవో కార్యాలయం ఏవో చంద్రారెడ్డి, సర్వేయర్ భాగ్యలక్ష్మి పాల్గొని రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కర్లపూడి గ్రామానికి చెందిన రైతు మంచికలపూడి శివప్రసాద్ తమ గ్రామపరిధిలో సుమారు 240 ఎకరాలు రైల్వేలైన్‌కు పోతుందనీ, గతంలో కూడా రాజధాని పూలింగ్‌లో 150 ఎకరాలు తీసుకున్నారనీ, అందువలన కర్లపూడి గ్రామంలోని భూమి మొత్తం పూలింగ్ కింద తీసుకోవాలని ఆర్డీవోకు తెలిపారు. వైకుంఠపురం గ్రామానికి చెందిన బి.శేషుబాబు తమ గ్రామపరిధిలో రైల్వేలైన్, గోదావరి, పెన్నా కాలువ కింద భూమి ఎక్కువ పోతుందనీ, అంతేగాక 22ఏ కింద ఉన్న భూమికి నష్టపరిహారం దేవాలయానికి ఇస్తారా లేక సంబంధిత రైతుకు ఇస్తారా తెలియజేయాల్సి ఉందని ఆర్డీవోను కోరారు. తాము కూడా పూలింగ్ ద్వారానే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి సేకరించే భూమికి మార్కెట్ విలువ కన్నా మూడు రెట్లు అధికంగా నష్టపరిహారం ఇస్తామని తెలిపారు. పూలింగ్ అనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అంశమని తెలియజేశారు. రైతుల విన్నపాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# పురుగుల మందు తాగి కుమారుడు.. ఉరేసుకుని తల్లి

● ఇద్దరూ ఆత్మహత్య
● ఇంటి నుంచి దుర్వాసన రావడంతో తలుపులు తీసిన స్థానికులు


వెల్లటూరు నాగేంద్రం (ఫైల్)


నాగరాజకుమారి(ఫైల్)

రేపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భార్య, భర్తల మధ్య గొడవల కారణంగా భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది చూసిన తల్లి తట్టుకోలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పట్టణంలోని 4వ వార్డులో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని 2వ వార్డుకు చెందిన లక్ష్మీతిరుపతమ్మతో వెల్లటూరు నాగేంద్ర(26)కు ఏడు సంవత్సరాల క్రితం వివాహం అయింది. నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్య, భర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో మూడు సంవత్సరాల నుంచి లక్ష్మీతిరుతమ్మ కుమారుడితో పుట్టింటి వద్దనే ఉంటుంది. ఈ నేపథ్యంలో భర్త నుంచి విడాకులు కోరుతూ సోమవారం లీగల్ నోటీసును నాగేంద్రకు పంపింది. విడాకుల నోటీసు అందుకున్న నాగేంద్ర తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఇంటి వద్ద మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. నాగేంద్ర మృతదేహాన్ని చూసి తట్టుకోలేని తల్లి వెల్లటూరు నాగరాజకుమారి(55) ఉరివేసుకుని ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. రెండు రోజుల నుంచి ఇంటి తలుపులు తియ్యకపోవటంతో ఇంటి నుంచి దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు బుధవారం ఉదయం ఇంటి తలుపులు తీసి పరిశీలించారు. నాగరాజకుమారి ఉరిపెట్టుకుని మృతి చెంది ఉన్నారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంటి దూలానికి వేలాడుతున్న నాగరాజకుమారి మృతదేహాన్ని కిందకుదించారు. ఇంటి పక్కన సందులో నాగేంద్ర మృతదేహం ఉంది. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు నాగేంద్ర చిన్నాన్న శ్రీమన్నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

# చీట్ ఫండ్స్

(5వ పేజీ తరువాయి)


సాయిసాధన చిట్ సంస్థ యజమాని పొలదుగు పుల్లారావు

చిట్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేయాలి. అనుమతులు వచ్చాకే చిట్ నిర్వహించాలి. ఎంత చిట్‌ను నిర్వహిస్తే అంత మొత్తం డిపాజిట్.. లేదా బ్యాంక్ గ్యారంటీ దాఖలు చేయాలి. ప్రతి చిట్‌కు మూడు బ్యాంకు ఖాతాలను నిర్వహించాలి. చిట్ పొందిన సభ్యుడికి 25 రోజుల్లో బ్యాంకు ఖాతా ఒకటి నుంచి డబ్బు చెక్కు రూపంలో చెల్లించాలి. సభ్యుడు నిర్ణీత గడువులోపు డబ్బు స్వీకరించకపోతే ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో నిల్వ ఉంచాలి. ఏ నెలలో ఏ సభ్యుడు చిట్ పొందాడన్న వివరాలను చిట్ రిజిస్ట్రార్‌కు లిఖితపూర్వకంగా తెలియపరచాలి. ఒక నెలలో ఇందుకు సంబంధించిన సమాచారం ఇవ్వని పక్షంలో సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలి. సభ్యుల నుంచి ఫిర్యాదులు లేని పక్షంలో డిపాజిట్ సొమ్మును చిట్ ముగిసిన తర్వాత సంస్థకు చెల్లించాలి. చిట్ సంస్థపై ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలి. లోపాలు ఉంటే చర్యలు తీసుకోవాలి. చిట్ సంస్థలపై రిజిస్ట్రేషన్‌శాఖలోని రిజిస్ట్రార్ పర్యవేక్షణ ఉండాలి. ప్రతి నెల సంస్థ సంబంధిత పత్రాలను దాఖలు చేస్తుందీ లేనిది పరిశీలించాలి. సభ్యులకు డబ్బు చెల్లింపులు ఎలా జరుగుతున్నాయన్న అంశాన్ని పరిశీలించాలి. అయితే ఈ నిబంధనలు ఏపీ ఎక్కడ కూడా అమలు కావడంలేదు. నరసరావుపేటలో ఓ చిట్ సంస్థ కాలపరిమితి పూర్తయిన మూడు నెలల వరకు సొమ్ము చెల్లించకపోవడంతో లేదు. వైద్యుడిగా ఉన్న ఆ సభ్యుడు చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా సంస్థపై చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి.

**భారీగా లాభాలు..**

ప్రతి గ్రూప్ చిట్‌కు మొదటి నెల, మూడో నెల పాటను సంస్థ తీసుకుంటుంది. ప్రతి నెల 5 శాతం కమీషన్ వసూలు చేస్తోంది. ఉదాహరణకు 10 లక్షల చిట్‌కు రెండు నెలలకు రూ.20 లక్షలను సంస్థ తీసుకుంటుంది. ప్రతీ నెల కమీషన్ రూపంలో నెలకు రూ.50 వేలు వసూలు చేస్తుంది. రూ.10 లక్షల చిట్‌కు మొత్తంగా రూ.30 లక్షలు చిట్ సంస్థకు వస్తుంది. ఇంత భారీగా లాభాలు వస్తున్నాయి. ఒక సభ్యుడు 2వ నెల చిట్ పొందినట్లయితే ముగ్గురు వ్యక్తుల గ్యారంటీతో చిట్ సొమ్ము చెల్లిస్తారు. ఇక వేళ చిట్ తీసుకున్న సభ్యుడు నెలవారీగా సొమ్ము చెల్లించకుంటే గ్యారంటీ ఇచ్చిన వక్తుల నుంచి ఆ మొత్తాన్ని రాబట్టుకుంటారు. ఏ కోణంలో చూసినా చిట్ సంస్థకు నష్టాలు వచ్చే అవకాశం లేదు. అయినా రిజిస్టర్ పేరుతో అక్రమంగా చిట్లు నిర్వహిస్తూ మదుపరులను మోసగిస్తున్నారు. ఈ క్రమంలో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# తల్లి మందలించిందని యువకుడు ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం తాగి తిరుగుతున్నాడని కుమారుడిని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలోని తురకపాలెం రోడ్డులో గల జన్మభూమి నగర్ మూడోలైన్‌కు చెందిన ధార ధనలక్ష్మి, భర్త సోమశేఖర్‌ల మధ్య మనస్పర్థలు వచ్చి కొద్ది సంవత్సరాలుగా వేరుగా ఉంటున్నారు. ధనలక్ష్మి తన ముగ్గురు పిల్లలతో కలిసి జన్మభూమి నగర్ మూడో లైన్‌లో నివాసం ఉంటుంది. అయితే ఆమె రెండో కుమారుడైన పూర్ణ కుమార్ (20) తాపీ పనులకు వెళ్తుంటాడు. నాలుగు రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం తాగి తిరుగుతుండటంతో బుధవారం ఉదయం తల్లి మందలించింది. అనంతరం ఆమె, పెద్ద కుమారుడుతో కలిసి పనికి వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద ఉన్న రేకుల షెడ్‌లోని రాడ్డుకు పూర్ణకుమార్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రేపటి నుంచి రంగస్థలి నాటిక పోటీలు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి, నరసరావుపేట రంగస్థలి సంయుక్త నిర్వహణలో రంగస్థలి 45వ వార్షికోత్సవం, 24వ జాతీయ ఆహ్వాన తెలుగు నాటక పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రకాశ్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా తొలిరోజు అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం, పండు క్రియేషన్స్ కొప్పోలు వారి పక్కింటి మొగుడు, వేసేయ్ లఘునాటిక ప్రదర్శించనున్నారు. రెండో రోజు కళాంజలి, హైదరాబాద్ వారి అన్నదాత, వెలవగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారి రాత నాటికలు ప్రదర్శించనున్నారు. అనంతరం శ్రీకృష్ణరాయబారం (పడకసీను) పౌరాణిక నాటకం ప్రదర్శించనున్నారు. మూడో రోజు జీవీకే క్రియేషన్స్, కాకినాడ వారి తితిక్ష నాటిక, అమరావతి ఆర్ట్స్, గుంటూరు వారి చిగురు మేఘం నాటిక, భోషాణ రహస్యం నాటిక ప్రదర్శించనున్నారు.

# ఆలయ కలశాల చోరీకి యత్నం


సీసీ పుటేజిలో కన్పిస్తున్న గుడి వెనుక వ్యక్తి

పమిడిమర్రు (నరసరావుపేట రూరల్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పమిడిమర్రు గ్రామంలో సుమారు 120 సంవత్సరాల క్రితం నిర్మించిన సీతారామస్వామి దేవస్థానంపై, గాలిగోపురంపై ఉన్న పురాతన పంచలోహ కలశాలను దొంగిలించేందుకు ఓ ముఠా తీవ్ర ప్రయత్నం చేసింది. ఆలయ ధర్మకర్త దాసరి వెంకట సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దొడ్డి పెద వెంకటేశ్వర్లు, దొడ్డి వెంకటేశ్వర్లు ఇద్దరూ మరికొంతమందితో కలిసి ఆలయం, గోపురంపైన ఉన్న కలశాలను దొంగిలించేందుకు ప్రయత్నించగా, ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయన్నారు. కలశాలను దొంగిలించేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీసీ పుటేజి ఆధారంగా నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

# 143 జీవో రద్దుకు పోస్టుకార్డు ఉద్యమం


ముఖ్యమంత్రికి పోస్టు కార్డు రాసిన వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో అత్యంత వివాదాస్పదమైన 143 జీవో రద్దు కోరుతూ గుంటూరు జిల్లాలో ఉద్యమం ఆరంభం అయింది. గుంటూరు జిల్లా తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 143 జీవో రద్దు కోరుతూ బుధవారం పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాదల అప్పారావు ఆధ్వర్యంలో ఉద్యోగులు జీవో రద్దు కోరుతూ ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు రాశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన 143 జీవో వలన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే జీవోను రద్దు చేయాలని కోరారు. తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే మెహబూబ్ సుభానీ, జిల్లా కార్యదర్శి టి.రామసీత, కోశాధికారి కోటేశ్వరమ్మ, సంయుక్త కార్యదర్శి నళిని, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.చినబ్రహ్మం, మన్నే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 541.90 అడుగులు ఉంది. ఇది 192.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8629 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 15,904 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 37,013 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

## బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 125,134,145 |
| చికెన్ విత్ స్కిన్ | 236.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 246.00 |

## 1,34,374 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,27,7981 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,34,374 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 69,103 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 9000 | 13500 | 334 | 9000 | 11500 |
| నెంబరు. 5 | 9500 | 13000 | నెంబరు.5 | -- | -- |
| 273 | 10000 | 12500 | 273 | -- | -- |
| 341 | 10000 | 14000 | 341 | -- | -- |
| 4884 | 9000 | 11500 | 4884 | -- | -- |
| సూపర్ 10 | -- | -- | సూపర్ 10 | -- | -- |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 10000 | 13800 | తేజ | 13300 | 13300 |
| బ్యాడిగి | 10000 | 13000 | బ్యాడిగి | 10000 | 12000 |
| దేవనూరు డీలక్స్ | 10000 | 13500 | దేవనూరు డీలక్స్ | -- | -- |
| తెల్లకాయలు | 4500 | 7500 | తెల్లకాయలు | 4500 | 7500 |

## లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయ సేవాధికారం సంస్థ గుంటూరు, మండల న్యాయ సేవ కమిటీ బాపట్ల ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించటం జరుగుతుందని బాపట్ల 6వ అదనపు జిల్లా జడ్జి, బాపట్ల మండల న్యాయ సేవ కమిటీ చైర్మన్ కె.శ్యాంబాబు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్, భరణం, గృహహింస, మోటర్ ప్రమాద, రెవెన్యూ, బ్యాంక్, చెక్‌బౌన్స్, రాజీపడ తగిన క్రిమినల్ కేసులు, ముందస్తు రాజీ చేసుకోదల్చిన కేసులు ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వకంగా రాజీ చేసి పరిష్కరించబడునని తెలిపారు.

## ప్రజలు ఆయుర్వేద మందులను ఉపయోగించుకోవాలి

కర్లపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలు ఆయుర్వేద మందులను ఉపయోగించుకొని తమ ఆరోగ్యాలను మెరుగు పర్చుకోవాలని పేరలి ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ సిద్ధార్థ అన్నారు. కర్లపాలెంలోని శ్రీ సత్యసాయిబాబా మందిరంలో పౌర్ణమి మాఘ మాసం సందర్భంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా డాక్టర్ సిద్ధార్థ రోగులకు బుధవారం మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు నాగేశ్వరరావు, తుమ్మల శ్రీనివాసరావు, రమేష్ ఉన్నారు.

## ఇంటి, నీటిపన్నుల వసూళ్ళు వేగవంతం చేయాలి : ఎంపీడీవో

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మార్చి 30కల్లా గ్రామపంచాయతీలలో ఇంటిపన్నులు, నీటి పన్నుల వసూళ్ళు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశపు హాలులో కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కార్యదర్శులు తడి, పొడి చెత్త వేరు చేసే కేంద్రాల వద్ద పారిశుధ్యాన్ని పాటిస్తూ వాటి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, సూపరింటెండెంట్ బి.మధుసూదనరెడ్డి, మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గుండె వైద్య శిబిరం

కొల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉచిత గుండె వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల గ్రామం బొద్దులూరుపాడులో విజయవాడ హెల్ప్ హస్పటల్ వైద్య బృందం హృద్రోగుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రోగులను పరీక్షిస్తారన్నారు. వైద్య శిబిరంలో యాంజియోగ్రామ్ టెస్టు అవసరమైన వారికి విజయవాడ హెల్ప్ హస్పటల్‌లో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రూ.12,500 విలువ కలిగిన పరీక్షను ఉచితంగా చేయించనున్నట్లు మురళీకృష్ణ తెలిపారు.

## జనార్ధనస్వామికి ప్రత్యేక పూజలు

కర్లపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం అగ్రహారంలోని జనార్ధనస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం నామ సప్తాహం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బృందావనం శ్రీనివాసచార్యులు, స్వామి పూర్ణానంద మహరాజ్, విమలానంద మహరాజ్, పెనుమెత్స బాపిరాజు, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

బాపట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణం త్యాగరాయ్ నగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి నిత్య కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ప్రతి రోజు 27 మంది దంపతులతో స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవాలు అర్చకులు పరాస రామ రామానుజాచార్యులు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి గరుడోత్సవంతో నగరోత్సవ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస సేవా సమితి సభ్యులు, ధర్మకర్త వీఎస్ సంపత్‌కుమార్, పీఎల్ నరసరాజు, పి.వెంకటేశ్వర్లు, నటరాజ్ పాల్గొన్నారు.

## ఘనంగా కల్యాణ మహోత్సవం

బాపట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీ మహర్షి ఆశ్రమ గోశాలలో మాఘ పౌర్ణమి సందర్భంగా మానసాదేవి సమేత జరత్కారు కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బాబునాగేంద్ర, ఆధ్యాత్మికవేత్త బీఎస్ నారాయణభట్టు, మామిడి రాజశేఖర్, బూర్లె శ్రీనివాసరావు, శ్రీరామపారాయణ సేవాసమితి సభ్యులు, సంపత్ గణపతిపరివార్ సభ్యులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● రూ.27 వేలు స్వాధీనం

బాపట్లరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై బాపట్ల రూరల్ పోలీసులు బుధవారం దాడి నిర్వహించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల మండలం ముత్తాయపాలెం పంచాయతీ చింతావారిపాలెం గ్రామశివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడిని నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.27 వేలను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. కేసు నమోదు చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

## పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

బాపట్ల రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఆరుగురు దాడికి పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల పట్టణం జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉండే నాగరాజుపై మధు, బుల్లిరెడ్డి మరో నలుగురుతో కలిసి దాడికి పాల్పడ్డారు. దీంతో నాగరాజుకు గాయాలవ్వటంతో బాపట్ల ఏరియావైద్యశాలకు చేరి చికిత్స పొందిన అనంతరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు నమోదు చేయటం జరిగిందని పట్టణ పోలీసులు తెలిపారు.



కావూరు గురుకుల పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సత్యప్రసాద్, జంగా కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్

# ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించండి

● మంత్రి అనగాని సత్యప్రసాద్

చెరుకుపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మద్దతుగా కావూరు జూనియర్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాలల్లో నేతలు ప్రచారం నిర్వహించారు. బాలికల గురుకుల పాఠశాలలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి జంగా కృష్ణమూర్తి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి తాము ఎల్లవేళలా కృషి చేస్తున్నామని, ఈ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు అవ్వాలంటే కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాము నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో తాము మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు టీడీపీ నేత కనగాల మధుసూదన్‌ప్రసాద్, సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దివి రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, మండవ తాతాజీ, మాజీ జడ్పీటీసీ పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలపాటి గెలుపే ధ్యేయంగా పని చేయాలి : ముస్తాక్ అహ్మద్

వేమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపే ధ్యేయంగా కూటమి శ్రేణులు కృషి చేయాలని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్ కోరారు. వేమూరు టీడీపీ కార్యాలయం ప్రాంగణంలో ఎమ్మెల్సీ బూత్ ఇన్‌చార్జ్‌లు, ఓటర్లతో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ టీడీపీ సిద్ధాంతాలకు కట్టుబడి రాజకీయ ప్రస్థానంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేయడంతో పాటు నాయకత్వ లక్షణాలతో ప్రజాసేవ చేస్తున్న ఆలపాటి విజయం ఎంతో అవసరమన్నారు. వేమూరు నియోజకవర్గానికి ఎంతో అనుబంధం ఉన్న ఆలపాటికి మరెక్కడా రానంత మెజారిటీ చూపించి ఆయనపై నియోజకవర్గ ప్రజలకు ఉన్న అభిమానాన్ని ప్రకటించాలన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హనీఫ్, టీడీపీ నాయకులు కోటిరెడ్డి, దాది లక్ష్మణ్, జనసేన నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు 17 గ్రామాలకు చెందిన బూత్ ఇన్‌చార్జ్‌లు, వివిధ విభాగాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ అల్లడి దేవకుమార్

## బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి

● దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ అల్లడి దేవకుమార్

బాపట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : 2025-2026 బడ్జెట్ దళిత గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుదల లక్ష్యంగా కేటాయింపులు పెంచాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ అల్లడి దేవకుమార్ అన్నారు. బుధవారం జిల్లా బడ్జెట్ వాచ్ సమావేశం బాపట్లలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ దళిత గిరిజనులకు జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపులు చేసి వాటిని ఖర్చు చేయాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాలు, ఎన్జీవోలు, రాజకీయపార్టీలు కృషి చేయాలన్నారు. కీలకరంగాలైన విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు ప్రభుత్వాలు ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి నూతన విద్యాసంస్థలను అవసరాలకు తగినవిధంగా నెలకొల్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీసీహెచ్ గంగయ్య మాట్లాడుతూ దళితులు పెద్ద సంఖ్యలో కౌలు రైతులుగా మారారని వారిని గుర్తించి కౌలు రైతుల గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలలో భాగస్వామ్యం చేయాలన్నారు. బహుజన సమాజ్ పార్టీ నాయకుడు కాగిత కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రజలకు అనేక గ్రామాలలో శ్మశాన స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడే దుస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది దగ్గుమల్లి కిరణ్, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా చైర్మన్ దేవరపల్లి డేవిడ్ రాజు, బీఎస్పీ నాయకులు జి.రాజారావు, పరైకోటయ్య, కె.వినయ్‌రాజు, దేవరకొండ రాము తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి పట్టభద్రుల ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి తదితరులు

కర్లపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎన్నికల (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని యేట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి బుధవారం పట్టభద్రుల అభ్యర్థుల ఇంటింటి కెళ్ళి ఎన్నికల ప్రచారం చేశారు. వారికి ఈ సందర్భంగా పార్టీ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చీరాల శ్రీనివాసరెడ్డి, యేట్ర నాగిరెడ్డి పాల్గొన్నారు.

## సర్వే సకాలంలో పూర్తి చేయాలి : ఎంపీడీవో

కర్లపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సర్వేలన్ని సకాలంలో పూర్తి చేయాలని సచివాలయం ఉద్యోగులకు ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు. కర్లపాలెం మండలం పేరలిపాడు, పెదగొళ్ళపాలెం సచివాలయాలను ఎంపీడీవో శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు తెలియజేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత

కర్లపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పేరలి గ్రామం పడమర యాదవపాలేనికి చెందిన షేక్ ఖాదర్ మొహిద్దీన్ బుధవారం మృతి చెందాడు. పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్‌చైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహాయ సహకారంతో కర్లపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, గేరా ఏసుబాబు చేతుల మీదగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు మృతుని కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కాగిత విజయరాజు, మద్దిబోయన బుల్లియ్య, ఆవుల కోటయ్య, ఎస్‌కే జానీబాషా, ఎ.శ్రీను పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం



అమ్మవారికి కల్యాణం జరుపుతున్న పురోహితులు

కర్లపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతాయపాలెం పంచాయతీ తూర్పుపాలెంలో ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి ఆలయంలో శాంతి కల్యాణ మహోత్సవం బుధవారం వేలాదిమంది భక్తుల నడుమ అర్చకులు ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్రబాబు, గ్రామసర్పంచ్ పీటా శ్రీనివాసరావు, జనసేన నాయకులు పెదమల్లు గంగరాజు, పెదమల్లు తాతయ్య, పెదమల్లు ఉదయచంద్రరావు, మార్కండేయులు, గ్రామ పెద్దలు తన్నీరు కృష్ణమూర్తి, ఏనుగు వెంకయ్య, రౌతు మల్లికార్జునరావు, పెదమల్లు సుబ్బారావు, తోట నాగేశ్వరరావు, రౌతు సుబ్బారావు, పెదమల్లు రంగారావు తదితర పెద్దలు గ్రామస్తులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## పన్నుల వసూళ్ళు వేగవంతం చేయాలి

● కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఖాళీ స్థలం పన్నులు, ఆస్తి పన్నులు, నీటికుళాయి ఛార్జీల వసూళ్ళు వేగవంతం చేయాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. బాపట్లలోని 14, 22, 6వ వార్డులలో బుధవారం ఆయన పర్యటించి పారిశుధ్య కార్మికుల హాజరు పట్టీని తనిఖీ చేసి సూచనలు చేశారు. గృహ యజమానుల వద్ద నుంచి చెత్తను సేకరించేటప్పుడు తప్పనిసరిగా తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలుగా వేరు చేసిన తర్వాత మాత్రమే తీసుకోవాలన్నారు. వార్డుల లో అంతర్గత రోడ్లను ప్రతి రోజు శుభ్రపర్చాలన్నారు. దోమలు ప్రబలకుండా డ్రైనేజీలలో పూడికతీత పనులు చేపట్టాలని శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావును ఆదేశించారు. శాంతినగర్, వెన్నెలకంటి నగర్‌లో పర్యటించి పారిశుధ్యం, తాగునీటి సరఫరా తీరును స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అసిస్టెంట్ ఇంజనీర్‌ను ఆదేశించారు. దిగువప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తప్పనిసరిగా నీటిని సరఫరా చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా విషయంలో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేదిలేదన్నారు. అనంతరం రైలుకట్ట సచివాలయం 3, 4ను మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయ కార్యదర్శులతో, మున్సిపల్ రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మొండి బకాయిలను గుర్తించి వాటి వసూళ్ళ విషయమై ప్రత్యేక శ్రద్ధ ఉండాలన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

## వెంకటేశ్వరరావు మృతి బాధాకరం : అనగాని



నివాళులర్పిస్తున్న మంత్రి అనగాని

రేపల్లె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : తోటి వారికి సహాయపడాలనే సద్గుణంతో ఉండే గూడపాటి వెంకటేశ్వరరావు మృతి బాధాకరమని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో నివాసం ఉంటున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు తండ్రి గూడపాటి వెంకటేశ్వరరావు బుధవారం మృతి చెందటంతో ఆయనకు మంత్రి అనగాని, పలువురు ప్రముఖ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ డైరెక్టర్ పంతాని మురళీధరరావు, అనగాని శివప్రసాద్, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, మద్రాస్ సాంబశివరావు, మేకా శివరామకృష్ణ, గోగినేని పట్టాభిరామారావు, పలువురు నివాళులర్పించారు.

## వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో మృత్యువాతపడుతున్న ఆవులు

నగరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆవులకు వైరల్ ఇన్‌ఫెక్షన్ విస్తరించటంతో శరీరం మొత్తం బొబ్బలు ఏర్పడి మృత్యువాతపడుతున్నాయని రేపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ నాంచారయ్య తెలిపారు. బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధిని లంపిస్కిన్ వ్యాధిగా పిలుస్తారని, ఇది ముఖ్యంగా కీటకాల ద్వారా ఒక పశువు నుంచి మరొక పశువుకు సోకుతుందని ఆయన తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న ఆవులు, ఎద్దులకు ముందుగానే వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. వైరస్ సోకిన పశువులకు ప్రభుత్వ పశు వైద్యశాలలో చికిత్స అందిస్తామని, ఎక్కడైనా ఈ సమస్య ఉన్నట్లు తెలిస్తే మొబైల్ వాహనం ద్వారా వైద్యం చేసే సౌకర్యం ఉందన్నారు. రైతులు సందేహాలు ఉంటే తమను సంప్రదించవచ్చన్నారు.

## పార్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పార్వతీ అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భట్టిప్రోలు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మాఘ పౌర్ణమి పురస్కరించుకుని పార్వతి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సామూహిక పూజలు నిర్వహించారు. అద్దేపల్లి ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజాది కార్యక్రమాలను తూనుగుంట్ల నాగసుధారాణి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## చెరుకుపల్లి డీఎల్పీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసన్



శ్రీనివాసన్‌కు అభినందనలు తెలియజేస్తున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి ఈవోపీఆర్డీ కేజీఎస్ శ్రీనివాసన్ బుధవారం చెరుకుపల్లి మండల డీఎల్పీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఆయనకు బొకేలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వాహన చోదకులు మంగళవారం గాయపడ్డారు. ఎస్‌ఐ శివయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లటూరుకు చెందిన తాళ్లూరి గోపి వెల్లటూరు నుంచి కోటిపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కోటిపల్లికి చెందిన జెట్టి సంపత్‌కుమార్ కూడా కోటిపల్లి నుంచి వెల్లటూరు వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఒకరికి కాలుకు, మరొకరి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 410 రైతు సేవా కేంద్రాలలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసీల్దార్‌లు , మండల వ్యవసాయాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధితాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయాలన్న లక్ష్యంతో కేంద్రప్రభుత్వం రైతులకు ఆధార్ తరహాలోనే 11 నెంబర్లతో కూడిన రైతు విశిష్ఠ గుర్తింపు నెంబర్‌ను ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని సంక్షేమ పథకాలకు ఈ గుర్తింపు నెంబర్ కీలకంగా మారనున్నదని తెలిపారు. జిల్లాలో సుమారు 1,44,660 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉన్నారని, ఆ రైతులకు ఈగుర్తింపు నెంబరును కేటాయించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 15 వేల మంది రైతులు ఈ గుర్తింపు నెంబరును నమోదు చేసుకోవటం జరిగిందన్నారు. జిల్లాలోని రైతులందరూ రైతు సేవా కేంద్రాల వద్ద కెళ్ళి తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ నెంబరుతో లింక్ అయిన సెల్‌ఫోన్లు తీసుకొని వెళ్ళి రైతు సేవా కేంద్రం సిబ్బంది ఫార్మర్ ఐడి నెంబరును పొందాలని తెలిపారు. రైతులు తమ సందేహాల నివృత్తి నిమిత్తం వ్యవసాయశాఖ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరుకు లేదా వ్యవసాయశాఖాధికారులను సంప్రదించవచ్చునని తెలిపారు.



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

## స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ విధానంపై సమావేశం

బాపట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ, టూరిజం శాఖతో కలిసి ప్రారంభించిన స్వచ్ఛతా గ్రీన్‌లీఫ్ విధానానికి సంబంధించి మొదటి జిల్లా కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కలెక్టర్ చేత నిర్మితమైన జిల్లా కమిటీ, బాపట్ల, చీరాల, రేపల్లె డివిజన్‌ల కమిటీలతో భేటి నిర్వహించారు. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గాను, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి, జిల్లా పంచాయతీ అధికారి సభ్యులుగాను, గ్రామీణ నీటిసరఫరా పర్యవేక్షణ ఇంజనీర్ కన్వీనర్‌గాను, జిల్లా టూరిజం అధికారి సభ్యకార్యదర్శిగాను ఉంటారని తెలిపారు. డివిజన్ కమిటీలో రెవెన్యూడివిజన్‌అధికారి చైర్మన్‌గాను, డివిజనల్ అభివృద్ధి అధికారి, హెడ్‌క్వార్టర్ మండలాభివృద్ధి అధికారి సభ్యులుగాను, గ్రామీణ నీటిసరఫరా ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ కన్వీనర్‌గాను ఉంటారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈవిధానంలో ఆతిధ్య సేవలందించే హోటల్స్, హోమ్ స్టేలు, లాడ్జీలు, ధర్మశాలలు మొదలగువాటిలో పారిశుధ్యం, మురుగునీరు, ఘన వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ మొదలగు అంశాలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మొదటి దశలో ఫిబ్రవరి 28వ తేదీ నాటికి జరుగుతుందని ఆతర్వాత దశలో మార్చి 15వ తేది నాటికి సదరు సంస్థలు వ్యర్థ నిర్వహణ సక్రమంగా నిర్వహించటం తదుపరి వాళ్ళు గ్రీన్‌లీఫ్ రేటింగ్‌కు సరిపడేలా వ్యర్థాల నిర్వాహణ చేస్తున్నట్లు డివిజన్ కమిటీలకు తెలియజేయాలన్నారు. తర్వాత దశలో డివిజన్ కమిటీలు ఆయా సంస్థలను తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న వ్యర్థాల నిర్వహణను మూల్యాంకనం చేసి ఆ సంస్థకు గ్రీన్ లీఫ్ రేటింగ్‌ను 1వ లీఫ్, 3వ లీఫ్, 5వ లీఫ్‌లలో ఒక దానిని ఇస్తూ మార్చి 31వ తేదీలోపు జిల్లా కమిటీకి సిఫార్సు చేస్తారని తెలిపారు. తర్వాత జిల్లా, డివిజన్ కమిటీల సిఫార్సులను పరిశీలించి వాటిలో కొన్నింటికి ఏప్రిల్ 30వ తేదీ నాటికి గ్రీన్‌లీఫ్ రేటింగ్ ఇవ్వటం జరుగుతుందన్నారు. మొదటి విడతగా ప్రతి డివిజన్‌లో హెడ్‌క్వార్టర్ మండలంలో ఈ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు.

## సిరిపూడిలో రీసర్వేను పరిశీలించిన ఆర్డీవో

నగరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరిపూడి గ్రామంలో రీసర్వేకు సంబంధించిన రికార్డుల పరిశీలన కోసం రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి బుధవారం సందర్శించారు. ఈ సందర్శనలో అధికారులు రీసర్వే ప్రక్రియలో జరిగిన పునఃపరిశీలనను సమీక్షించి భూ రికార్డుల సరికొత్త నమోదు విధానంపై గ్రామస్తులతో చర్చించారు. అధికారులు రీసర్వే రికార్డులు పరిశీలించేందుకు గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు. తుది శ్రేణి నివేదిక తయారీకి అవసరమైన సవరణలు, సమస్యలు, సూచనలను గుర్తించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.నాంచారయ్య, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, సర్వే బృందం, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

## ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ

● వాహన చోదకుడు మృతి... మరొకరికి తీవ్ర గాయాలు




ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ ఆంజనేయులు

కొల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వంట చెర కు లోడుతో వస్తున్న ట్రాక్టర్, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి కొల్లిపర మండలం అన్నవరపు లంకకు చెందిన ట్రాక్టర్ వంట చెరకు లోడుతో కొల్లూరు మండలం తురకపాలెం వస్తుండగా తురకపా లెం చెందిన కొమరాబత్తుని తేజ (22), తన స్నేహిడుతైన తోకలవానిపాలేనికి చిలకా నాగరాజును ఇంటి వద్ద దించేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో తేజ అక్కడే మృతి చెందగా, నాగరాజు గుంటూరులోని సమగ్ర ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లుగా పోలీసులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించామన్నారు. మృతుని తండ్రి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ తోడేటి రవిపై ఏఎస్ఐ అర్జున్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

### న్యాయం చేయాలని ఆందోళన

తేజ కుటుంబ సభ్యులు గ్రామస్థులు, బంధువులతో బుధవారం కొల్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలంటూ రాస్తారోకో, ఆందోళన చేశారు. వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు స్టేషన్‌కు చేరుకుని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులతో చర్చించారు. చట్ట ప్రకారం ప్రమాదకానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించడంతో పాటు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహింపజేసి కుటుంబ సభ్యులకు అప్పగించడమే తమ పని అని, వాహనదారుల నుంచి బాధితులకు నగదు ఇప్పించడం తమ పని కాదని, వాహనదారులతో మీరే మాట్లాడుకోవాలని వారికి నచ్చజెప్పారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన విరమించారు. అయితే మృతునికి ఐదు నెలల క్రితమే వివాహం అయ్యిందని, భర్తను తలుచుకుని భార్య విలపిస్తున్న తీరు అందరిని కలిచివేసింది.

## వైభవంగా నృసింహుని తెప్పోత్సవం


శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి

తాడేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్ల తెప్పోత్సవాన్ని బుధవారం కృష్ణానదిలో వైభవంగా నిర్వహించారు. తొలుత మంగళగిరి నుంచి స్వామివార్లను తాడేపల్లిలోని శ్రీమద్వి రాంజనేయస్వామి ఆలయానికి తీసుకురాగా, అర్చకులు దివి అనంత పద్మనాభాచార్యులు, మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, స్థానిక అర్చకులు వైకానస ఆగమాను సారంగా విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. అనంతరం మధ్యా హ్నం దేవస్థానం నుంచి స్వామి వారు ఊరేగింపుగా కృష్ణానది వరకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యే కంగా అలంకరించిన పంట్‌పై స్వామివార్లను అధిష్టంపజేసి శోభాయమానంగా అలంకరించారు. బంగారు గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన నృసిం హుడిని భక్తులు దర్శించుకున్నారు. ఉండవల్లి కరకట్ట నుంచి ప్రారంభమైన తెప్పోత్సవం విజయవాడ దుర్గా ఘాట్ వరకు వె ళ్లి తిరిగి కరకట్టను చేరుకుంది. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయా నికి చేర్చారు. మంగళాద్రి దేవస్థానం ఏసీ అండ్ ఈవో అన్నప రెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. కైంకర్యపరులుగా పెదపా లెంకు చెందిన పెమ్మసాని శైలేంద్ర తదితరులు వ్యవహరించారు.

## ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన 60 మంది ట్రైనీ జడ్జీలు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 60 మంది ట్రైనీ జూనియర్ సివిల్ జడ్జీలు తమ శిక్షణలో భాగంగా పలు రకాల మెడికో లీగల్ కేసులపై అధ్యయనం చేసేందుకు బుధవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిని సందర్శించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ట్రైనీ జడ్జీలకు ఎమ్మెల్సీ కేసుల్లో పలు అంశాలను వివరించారు. ట్రామా, ఎమర్జెన్సీ విభాగంలో రోడ్డు ప్రమాద కేసుల పూర్వాపరాలను ఎమర్జెన్సీ వైద్య విభాగాధిపతి డాక్టర్ చంద్ర రాధిక రాణి వివరించారు. ఆర్థోపెడిక్ విభాగంలో చికిత్సలకు వచ్చే పలు ఎమ్మెల్సీ కేసుల వివరాలను అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అలేఖ్య వివరించారు. మెడికల్ రికార్డు ఆఫీసర్ రామారావు, ఆసుపత్రికి వచ్చే పలు రకాల కేసులకు సంబంధించి వివరాలు, ఎమ్మెల్సీ కేసు షీట్లను భద్రపర్చే విధానాలను ట్రైనీ జడ్జీలకు వివరించారు. అనంతరం మార్చురీలో మృతదేహాలకు పోస్ట్ మార్టమ్ ప్రక్రియను తిలకించారు. ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం నిపుణులు డాక్టర్ జాఫర్ ఆయా ఎమ్మెల్సీ కేసుల్లో ఎదురయ్యే న్యాయపరమైన అంశాలను ట్రైనీ జడ్జీలకు వివరించారు.


ట్రైనీ జడ్జీలతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రమణ

### జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో...

## వీఎంయూల ఏర్పాటు

- సెక్టోరల్ ప్రణాళికలను ఇవి పర్యవేక్షిస్తాయి
- సెక్రటరీల సమావేశంలో ప్రభుత్వం ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047లో భాగంగా జిల్లా, నియోజక వర్గ స్థాయిల్లో విజన్ మానిటరింగ్ యూనిట్ (వీఎంయూ)ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. సెక్టోరల్ ప్రణాళికల అమలు, సమన్వయం, పర్యవేక్షణ కోసం వీటిని నెలకొల్పనున్నట్లు పేర్కొన్నది. జిల్లాస్థాయి అధికారులకు సామర్థ్యాన్ని పెంచడం, మార్గదర్శకం చేయడం వంటివి చేపట్టనున్నట్లు ప్రకటించింది. అమరావతి రాజధానిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరుగు తున్న సెక్రటరీలు, మంత్రుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకొన్నారు. ఏవైతే త్వరగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉన్నదో అలాంటి ప్రాజెక్టులను గుర్తించా లని జిల్లా అధికారులను ఆదేశించారు. మండల, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కేపీఐ(కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్)లను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా పోర్టల్‌ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్‌ని అమలు వేగాన్ని పెంచేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందిని డిప్యూటేషన్ చేయాలని సూచించారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ఐదుగురు, నియోజకవర్గ స్థాయిలో ఆరుగురు చొప్పున డిప్యూటేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయంలో 16.02, పరిశ్రమల్లో 17, సర్వీసు సెక్టార్‌లో 16.25, జీవీఏ 16.34, జీఎస్‌డీపీ 16.16, తలసరి ఆదాయం 15.76 శాతం వృద్ధి చెందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ. 2,66,653 ఉండగా ఇది రూ. 3,11,004 పెరిగేలా చూడాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 18,230 ఫిర్యాదులు వివిధ శాఖలకు చెందినవి అందాయి. ముఖ్యమంత్రి, సీఎంవోకు అందిన ఫిర్యాదుల్లో గుంటూరు 1,142తో మూడో స్థానంలో ఉన్నది. ఈ ఫిర్యాదుల సంఖ్యని తగ్గించాలని ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్‌ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాలను ఈ వారంలోనే జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు సంబంధిత సెక్రటరీలు తెలియజేయనున్నారు.

## గడువులోపే రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి

● గుంటూరు రైల్వే డివిజన్ ఇన్‌స్పెక్షన్‌లో జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పథకం కింద గుంటూరు రైల్వే డివిజన్‌కు మంజూరు చేసిన స్టేషన్ల అన్నిం టిలో నిర్ణీత గడువు తేదీ లోపు పనులు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన బుధవారం ఉదయం గుంటూరు నుంచి పగిడిపల్లి రైల్వేస్టేషన్ వరకు సెక్షన్ మొత్తం ఇన్‌స్పెక్షన్ చేశారు. జోనల్ ఉన్నతాధికారులు, గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ, ఇతర సీనియర్ అధికారులతో కలిసి ఆయన పరిశీలన జరిపారు. తొలుత గుంటూరు రైల్వేస్టేషన్‌లోని సర్క్యులేటింగ్ ఏరియా, ప్లాట్‌ఫాంలు, కంబైన్డ్ క్రూ లాబీ, టిక్కెట్ కౌంటర్‌లు, ఏటీవీఎం యంత్రాల పనితీరుని పరిశీలించారు. క్రూ లాబీలో లోకోపైలట్లు, అసిస్టెంట్ లోకోపైలట్లు విశ్రాంతి తీసుకునేలా సకల సదు పాయాలు కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగుల రన్నింగ్‌రూంని కూడా జీఎం సందర్శించారు. ఫుడ్ స్టాల్స్‌లో గడువు తేదీ దాటిపోయిన వాటిని విక్ర యించకుండా చూడాలని డీఆర్‌ఎంని ఆదేశించారు. గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపున అభివృద్ధి చేస్తున్న సర్క్యులేటింగ్ ఏరియాని అధునాతనంగా తీర్చిదిద్దాలన్నారు.

గుంటూరు రైల్వేస్టేషన్ తనిఖీ అనంతరం ఆయన ఇన్‌స్పెక్షన్ కార్ బ్యాక్‌విండో(వెనక కిటికీ) నుంచి రైలుమార్గాన్ని పరిశీలించారు. సెక్షన్ గరిష్ట వేగాన్ని కూడా ఈ సందర్భంగా టెస్టింగ్ చేశారు. నల్లపాడు రైల్వేస్టేషన్‌లో పాదచారుల వంతెనని పరిశీలించి రన్నింగ్ రూంలను తనిఖీ చేశారు. లోకోపైలట్లు, గా ర్డులతో సంభాషించి అక్కడ లభిస్తున్న సదుపాయా లపై ఆరా తీశారు. ఫిర్యాదు రిజిష్టర్‌లో నమోదైన కంప్లయింట్‌లు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్య లను ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం నల్లపాడు - పిడుగురాళ్ల సెక్షన్‌ని తనిఖీ చేశారు. పొందుగల వద్ద కృష్ణానదిపై ఉన్న వంతెన పటిష్టతని పరిశీలించారు. క్రమం తప్పకుండా ఈ బ్రిడ్జిని మెయిన్‌టెనెన్స్ చేస్తుండాలని సూచించారు. అక్కడి నుంచి విష్ణుపురం, మిర్యాలగూడ రైల్వేస్టేషన్లను వెళ్లి అక్కడ తనిఖీలు చేపట్టారు. అమృత్ భారత్ స్టేషన్ కింద మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులు, విస్తరణ ప్రణాళికలను సమీక్షించారు. నిర్దేశిత గడువు లోపు పనులు పూర్తి చేయాలని డీఆర్‌ఎంని ఆదేశించారు. అనంతరం రాయనపాడు - తిప్పర్తి రైల్వేస్టేషన్ల మధ్యన ఉన్న లెవల్‌క్రాసింగ్ గేటు నంబరు. 54ని తనిఖీ చేసి అక్కడ విధి నిర్వహణలో ఉన్న గేట్‌మ్యాన్‌తో సంభాషించారు. అత్యవసర పరిస్థితుల్లో విధుల నిర్వహణపై గేట్‌మ్యాన్‌కు ఉన్న జ్ఞానం, భద్రత విధానాలను అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు.

చివరగా నల్గొండ రైల్వేస్టేషన్‌ని తనిఖీ చేసి ప్రయాణికులకు లభిస్తున్న సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ఏరియా, ఎఫ్‌వోబీ, స్టేషన్‌మాష్టరు గదిని పరి శీలించారు. అలానే మార్గమధ్యలో ఉన్న చిన్న వంతెనల వద్ద కూడా జీఎం ఆగి వాటి పటిష్టతని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే కార్మిక సంఘాల నాయకులను జీఎం కలుసుకుని వినతిపత్రాలు స్వీకరించారు. అలానే ప్రజాప్రతినిధులతో రైల్వేస్టేషన్ల అభివృద్ధి గురించి చర్చించారు. ఇన్‌స్పెక్షన్‌లో డీఆర్‌ఎంతో పాటు గుంటూరు రైల్వే డివిజన్ నుంచి సీనియర్ అధికారులు జేవీ అనూష, డాక్టర్ ప్రదీప్‌కుమార్, దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

## గుంటూరు మీదగా నాలుగు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా నాలుగు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూ రు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. నంబరు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 14, 21 తేదీల్లో రాత్రి 7.20కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు వేకువజామున 4.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 16, 23 తే దీల్లో సాయంత్రం 6.55కి బయలు దేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మ రుసటి రోజు ఉదయం 6.50కి చర్లపల్లి చేరు కొంటుంది. నంబరు. 07233 చర్లపల్లి - నరసపూర్ స్పెషల్ ట్రైన్ ఈ నెల 14, 21 తేదీల్లో రాత్రి 7.15కి బ యలుదేరి మరుసటి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు వేకువజామున 5.50కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు. 07234 నరసపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 16, 23 తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీద గా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుందన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులతో డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల సమన్వయకర్త జి.శ్రీకూర్మనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లమూడిలోని ఇంటర్ కళాశాలలో విద్యార్థులతో ఆయన అభినందన సభ నిర్వహించారు. జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన వై. విష్ణు కార్తీక్ (99.45), ఆర్. శ్రీకాంత్ ( 98.38), కె విష్ణువర్ధన్ ( 96.78), ఎస్. ప్రేమ్ కుమార్ (96.33), ఎస్ డీ అర్షాద్ (96.29), బాషా ( 96.13), ఉమేష్ నారాయణ్ ( 95.92), వీ. కౌశిక్ ( 93.47), గౌతం రెడ్డి (93.28), నాగ జస్వంత్ (91.18), అవినాష్ (91.08), ఉమేష్ చౌదరి( 90.50), రిక్సిత్ (90.03) పర్సంటైల్‌తో ప్రభంజనం సృష్టించారని సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలి పారు. 25 శాతం మంది విద్యార్థులు 90 శాతంకు పైగా పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. ప్రిన్సిపాల్ జె. మోహన్ రావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

### మిర్చి విదేశీ ఎగుమతిదారుల

## రహస్య సమావేశం

- ధర తక్కువగా ఉన్నప్పుడే అక్కడి దిగుమతిదారులతో ఒప్పందాలు
- ఆ రేటుకే యార్డులో కొనుగోలు చేయాలని నిర్ణయం
- అందుకే మార్కెట్ పెరగడం లేదని కమీషన్ వ్యాపారస్థుల సందేహం

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు మిర్చిని ఎగుమతి చేసే కొంతమంది వ్యాపారస్థులు రెండు రోజుల క్రితం రహస్యంగా ఒక స్టార్‌హోటల్‌లో సమావేశమైనట్లు మిర్చియార్డులో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. గత ఏడాది కంటే ప్రస్తుత మిర్చి సీజన్‌లో ఎక్స్‌పోర్టు వెరైటీల ధర పడిపోవడం, రైతుల ఆందోళనలు, ప్రభుత్వ స్థాయిలో సమీక్షలు జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యం సంతరించుకొన్నది. విదేశాలకు ఎగుమతి చేసే ఎక్స్‌పోర్టర్లు ధర పెంచితేనే మార్కెట్ పెరుగుతుంది. లేకుంటే ప్రస్తుతం ఉన్న ధరల్లో ఎలాంటి వ్యత్యాసం ఉండదు. అయితే తక్కువ ధరకే మిర్చిని పంపుతామని వివిధ దేశాల నుంచి ముందుగానే ఆర్డర్స్ తీసుకొని కొంతమేరకు ఈ ఎక్స్‌పోర్టర్లు అడ్వాన్స్‌లు కూడా పొందారన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పుడు రేటు పెరిగితే విదేశీ ఎగుమతిదారులకు లాభాలు రాకపోగా నష్టాలు వచ్చే పరిస్థితి ఉండటంతో అంతా ఒక మాట మీద నిలబడి ధర పెరగకుండా చూడాలన్న నిర్ణయానికి వచ్చినట్లు కమీషన్ వ్యాపారస్థులు సందేహిస్తున్నారు.

గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు) నుంచి ఏటా చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్, ఇండోనేషియా వంటి దేశాలకు మిర్చి ఎగుమతులు జరుగుతుంటాయి. అయితే ఎక్స్‌పో ర్టర్లలో కొంతమందే ఆయా దేశాల్లోని దిగుమతిదారులతో ఒప్పందా లు చేసుకొంటారు. మిగతా ఎగుమతిదారులు దేశీయంగానే వివిధ రాష్ట్రాల నుంచి ఆర్డర్స్ తీసుకొని మిర్చిని సరఫరా చేస్తుంటారు. మిర్చియార్డులో తేజ, బ్యాడిగి, దేవనూరు డీలక్స్ వంటి వెరైటీల మిర్చి ధర పెరగాలంటే విదేశీ ఎగుమతులే కీలకం. చైనాకు సీజన్‌లో ప్రతీ నెలా వెయ్యి కంటైనర్ల వరకు మిర్చి ఎగుమతి జరుగుతుం టుంది. అలానే శ్రీలంకకు 150 కంటైన్ల వరకు ఎక్స్‌పోర్టు జరుగు తుంది. బంగ్లాదేశ్‌కు లారీల ద్వారా సరుకు వెళుతుంటుంది. కాగా గత ఏడాది ఆగస్టు నెల తర్వాత మిర్చి ధర తగ్గుతూ వచ్చింది. ప్ర స్తుత సీజన్‌లో నాణ్యమైన మిరపకాయలను రైతులు తీసుకొస్తున్న ప్పటికీ విదేశీ ఎగుమతిదారుల నుంచి పెద్దగా స్పందన ఉండటం లేదు. ఎంతసేపటికీ క్వింటాల్ రూ. 11 వేల నుంచి రూ. 12 వేలకే కొనుగోలు చేయడానికి వేలం సమయంలో ధర ప్రతి పాదిస్తున్నా రు. ఇందుకు కారణం విదేశాలకు చెందిన దిగుమతి దారులతో తక్కువ ధరకే మిర్చి సరఫరా చేస్తామని ముందుగానే ఒప్పందాలు చేసుకొన్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. అదే ఇప్పుడు ధర పెరిగితే ఆయా దేశాల్లోని వ్యాపారస్థులతో చేసుకొన్న ఒప్పందం మేరకు మిర్చిని సరఫరా చేయలేరు. ఈ కారణంగానే ఎక్స్‌పోర్టర్లు ధర పెంచడం లేదని కమీషన్ వ్యాపారస్థులు భావిస్తున్నారు.

ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజ్‌లలో 80 శాతం ఖాళీగా ఉన్నాయి. వాటిల్లో నిల్వలు ఎక్కువగా ఉంటే మార్కెట్‌లో ధర పెరగదు. అలాంటిది శీతల గిడ్డంగుల్లో నిల్వలు పెద్దగా లేకపోయినా ధర పెరగడం లేదు. మిర్చియార్డుకు వచ్చే వారిలో చాలామంది చిన్న, సన్నకారు రైతులే. రెండు నుంచి నాలుగైదు ఎకరాలు సాగు చేసి పండించిన మిర్చిని వెనువెంటనే విక్రయించుకోవాలని చూస్తుంటారు. శీతల గిడ్డంగుల్లో స్టాకు పెట్టుకొని ధర పెరిగినప్పుడు విక్రయించొచ్చులే అని ఎదురు చూసే పెద్దరైతులు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారు. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని ధర పెరగకుండా చూస్తే గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ ధరకే అమ్మేలా చేస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఈ సిండికేట్‌ని ప్రభుత్వం విచ్ఛిన్నం చేయగలిగితేనే రైతులకు కనీసం నష్టం లేకుండా మిర్చియార్డులో ధర లభిస్తుందన్న అభిప్రాయం వివిధ వర్గాల ద్వారా వ్యక్తమౌతున్నది.

## జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలించిన పీఆర్ కమిషనర్


జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్ మెంట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీఆర్ కమిషనర్ కృష్ణ తేజ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలంలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ వీఆర్ కృష్ణ తేజ బుధవారం పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన ఘన వ్యర్థాలను విద్యుత్‌గా మార్చే ప్రక్రియపై ఆరాతీశారు. గుంటూరుతో పాటు, చుట్టుపక్కల ఉన్న మునిసిపాలిటీల నుంచి రోజుకు 1200 టన్నుల ఘన వ్యర్థాలను సేకరించి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని సంస్థ ప్రతినిధులు కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి బీవీఎస్ సాయికుమార్, పల్నాడు డీపీవో భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఏ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రభంజనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అన్నా నందకిషోర్ తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ, సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని చైర్మన్ అన్నా నందకిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంఏ ఫైనల్‌లో షేక్ మొహమ్మద్ ఆలీ 18వర్యాంకు, సీఎంఏ ఇంటర్‌లో కే యోగితారెడ్డి 27వర్యాంకు సాధించినట్లు, జీ రామ్‌చరణ్‌తేజ 442 మార్కులు, డీ వెంకటరామిరెడ్డి 437, ఎం మోక్షిత 431, జీ స్వాతి 430 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ నుంచి సీఏ,సీఎంఏ కోర్సులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో క్రమశిక్షణతో కూడిన కోచింగ్ అందిస్తున్నామన్నారు. విద్యార్థులను సంస్థ డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.

## పరీక్ష టేబుళ్లను ప్రారంభించిన డాక్టర్ లక్ష్మీరజని

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, పీజీ విద్యార్థుల సౌకర్యార్థం విరాళంగా అందజేసిన ఎగ్జామ్ టేబుళ్ళు, చైర్లను దాత డాక్టర్ నర్రంనేని లక్ష్మీరజని బుధవారం ప్రారంభించారు. జీఎంసీ 1998వ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ లక్ష్మీరజని, రూ.10 లక్షలతో ఈ టేబుళ్లను, కుర్చీలను విరాళంగా కాలేజీకి అందజేశారు. దివంగతులైన తన తండ్రి నర్రంనేని లక్ష్మీనారాయణ స్మారకార్థం ఈ విరాళం ఆమె అందజేశారు. బుధవారం కళాశా లలో జరిగిన కార్యక్రమంలో వీటిని ప్రారంభించి, శిలాఫలకం ఆమె ఆవిష్క రించారు. కార్యక్రమంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటితో ఉపసంహరణ గడువు ముగింపు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగియనుంది. నేటి సాయంత్రం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించడం జరుగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నాయి. ప్రస్తుతం 30 మంది అభ్యర్థులు బరిలో కొనసాగుతున్నారు.

## 527 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

### కేసు నమోదు చేసిన అధికారులు

నూజెండ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త నాగిరెడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకుని 6(ఏ) కేసు నమోదు చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన, ఆటలో తీసుకు వచ్చిన రెండు వందల 264.20 క్వింటాళ్ళు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వినుకొండలోని సివిల్ సప్లయిస్ గోదాములకు తరలించి విచారణ చేస్తున్నట్టు తహసీల్దార్ జీ రమేష్ కుమార్ తెలిపారు. పెద్దసంఖ్యలో రేషన్ బియ్యం నిల్వలు ఉండటంతో ఇన్‌చార్జ్ డీఎస్‌వో సుశీల రైస్ మిల్లును సందర్శించి తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు, వీఆర్‌వో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారి ఇన్‌చార్జ్ డీఎస్‌వో సుశీల తదితరులు

## పల్నాడులో లెదర్‌పార్కు

మాచర్ల రూరల్, నకరికల్లు, వినుకొండటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో ప్రభుత్వం లెదరు పార్కు ఏర్పాటు దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ క్రమంలో అనువైన ప్రదేశాలను పరిశీలిస్తుంది. అందులో భాగంగా బుధవారం మాచర్ల, నకరికల్లు, వినుకొండ ప్రాంతాల్లో కొరియా నిపుణులు స్థల పరిశీలన చేశారు. ఆయా ప్రాంతాల్లోని స్థలాలకు చేరుకుని మ్యాప్‌లను పరిశీలించారు. నీటివసతి, నేషనల్ హైవే నుంచి దూరం, విద్యుత్, భూమి స్వభావం తదితర వసతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాచర్ల మండల పరిధిలోని రాయవరంలో ఏపీఐఐసీకి కేటాయించిన సర్వే నంబరు 795బై3లో 151 ఎకరాలు, కొత్తపల్లిలో ఏపీఐఐసీకి కేటాయించిన సర్వే నంబరు 67బై5లో 450 ఎకరాల భూములను పరిశీలించారు.

- వినుకొండ మండలం వెంకుపాలెం కురవ వద్ద ఉన్న సర్వే నెం.1లోని 98 ఎకరాల్లోని ప్రభుత్వ భూమిని ఈ బృందం పరిశీలిం చింది. భూమి స్థితిగతులు, కొండ నీరు పోయే మార్గంతో పాటు పరిశ్రమకు అనువైన స్థితిగతుల గురించి అధికారులను అడిగి కొరియా నిపుణులు తెలుసుకున్నారు. దొనకొండలో విమానాశ్రయంతో పాటు, కేవలం 7 కిలోమీటర్ల దూరంలో రైల్వేస్టేషన్ ఉందని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు కంపెనీ ప్రతినిధులకు తెలిపారు.
- నకరికల్లు మండలం యంగ్‌బుల్ రేరింగ్ సెంటర్(పూర్వపు బీబీసీ)కి చెందిన భూములను కొరియా ప్రతినిధులు పరిశీలించారు. 530 ఎకరాల భూమి ఉండగా వివిధ కేటాయింపులకు పోగా ప్రస్తుతం 50 ఎకరాలు మాత్రం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని, మరో 25 ఎకరాలు ఇండో ఇజ్రాయేలు ప్రాజెక్టులో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కొరియా దేశానికి చెందిన సీఈవో బాబుషారూక్, కేవైలి, లోకేషన్, వాసులతో పాటు ప్రభుత్వం తరపున కే రంజిత్, ఆర్డీవోలు మధులత, మురళీకృష్ణ, డీఆర్‌వో మురళి, సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్లు కే పుల్లారావు, కిరణ్‌కుమార్, సురేష్, పరిశ్రమల జీఎం సుధాకర్, జిల్లా సర్వేయర్ శేషగిరిరావు, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, మండల సర్వేయర్లు వెంకటేశ్వర్లు, రఘుపతి, చండీరాణి, వినుకొండ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, నాయకులు నాగశ్రీను, లెనిన్, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న కొరియా నిపుణులు, అధికారులు

# మట్టిరోడ్లకు మోక్షం

### ఎమ్మెల్యే ఏలూరి కృషితో

### ద్రోణాదుల, ఇడుపులపాడు అభివృద్ధి పనులు

మార్టూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో మట్టిరోడ్డు తారు రోడ్డుగా నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కానీ రోడ్డు పనులను ప్రారంభిస్తే బిల్లులు వస్తావో, రావో అనే భయంతో పనులు చేయడానికి కాంట్రాక్టరు ఆసక్తి చూపలేదు. అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భరోసాతో కాంట్రాక్టరు ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.మార్టూరు మండలంలోని ద్రోణాదుల గ్రామం నుంచి ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామం వరకు తారురోడ్డుతో పాటు, రెండు గ్రామాలలో అంతర్గతంగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన క్రింద 3.53 కోట్లు రూపాయలు నిధులు మంజూరయ్యాయి. గత ఏడాది 2024న జనవరిలో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయి. సంబంధిత టెండర్ల దశ కూడా ముగిసింది. కానీ కాంట్రాక్టరు రోడ్డు పనులను మొదలెట్టలేదు. పర్చూరు నియోజకవర్గంలో ప్రాధాన్యత కలిగిన పాత మద్రాసు రోడ్డు (స్టేట్‌హైవే) నుంచి మార్టూరు మండల పరిధిలో ఉన్న జొన్నతాళి రోడ్డు (నేషనల్‌హైవే) వరకు ప్రయాణం సులభతరంగా ఉంటుందనే ఆలోచనతో ఈ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు గ్రామాల మధ్య 5.630 కిమీ దూరం ఉంది. ప్రస్తుతం సగం పనులకు పైగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.మార్చి 15వ తేదీలోపు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి.



ద్రోణాదుల, ఇడుపులపాడు గ్రామాల మధ్య కొంతదూరం వేసిన తారు రోడ్డు



చకచకా సాగుతున్న రోడ్డు పనులు

### రోడ్డుపనులు జరుగుతుండడంతో ప్రజల ఆనందం

ద్రోణాదుల - ఇడుపులపాడు గ్రామాల మధ్య నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణం ఈ రెండు గ్రామస్థులకే కాకుండా మిగిలిన గ్రా మాల ప్రజలందరికీ కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు నిర్మాణానికి చాలా మంది కృషి చేసినప్పటికీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహాయ సహకారాలతో రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరగడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ద్రోణాదుల గ్రామం నుంచి చీరాల, వేటపాలెం పట్టణాలకు వెళ్లడానికి ప్రజలకు ఈ రహదారి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. అదేవిధంగా పర్చూరు, ఇంకొల్లు మధ్య పాత మద్రా సు రోడ్డు నుంచి త్వరితంగా ఇడుపులపాడు, ద్రోణాదుల, చిమ్మిరిబండ, రాజుగారిపాలెం గ్రామాల మీదుగా 216 జాతీయ దారి జొన్నతాళి రోడ్డు చేరడానికి ప్రజలకు సులభంగా ఉంటుంది. అన్నింటికన్నా ద్రోణాదుల, ఇడుపులపాడు గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఈ రోడ్డు పక్కనే ఉన్నాయి. దాంతో పంటల సాగు సమయంలో, ఇతరత్రా వ్యవసాయపనులు సమయంలో ఈ రహదారి రైతులకు ఎంతో అనువుగా ఉంటుంది. త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత మార్టూరు నుంచి ద్రోణాదుల మీదుగా ఇంకొల్లు, పర్చూరు, చీరాల, వేటపాలెం తదితర పట్టణాలకు రవాణా సులభతరం కానుంది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

## 16న జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

### హాజరు కానున్న మంత్రి రవికుమార్, సినీనటుడు సుమన్

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌బీ డ్రాగన్స్ షటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన స్థానిక గీతామందిర్‌లో జాతీయ స్థాయిలో ఓపెన్ కరాటే కుంగ్ఫు, టైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని పోటీల చీఫ్ ఆర్గనైజర్ పీ రాంబాబు తెలిపారు. బుధవారం స్థానిక చిన్ని మురళీ కృష్ణ ఆఫీస్‌లో పోటీలకు సంబంధించి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతు ఈ పోటీలకు 8 రాష్ట్రాల నుంచి సుమారు 700 మంది పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సినీ హీరో సుమన్ హాజరవుతారని తెలిపారు. అసోసియేషన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ జి.సాయిరాం ఇతర అధికారుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అద్దంకిలో 40 సంవత్సరాల కిందట కరాటే మాస్టర్‌గా ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు జాతీయ స్థాయి చీఫ్ ఆర్గనైజర్ స్థాయికి చేరి, ప్రస్తుతం తన స్వస్థలం అద్దంకిలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయం అని కరాటే రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ అన్నారు. ఈ పోటీలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కరాటే మాస్టర్ వెంకటరత్నం, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల కల్యాణం

అద్దంకి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని వింధ్యావాసిని సమేత నగరేశ్వరస్వామి దేవాలయం (వేయి స్తంభాలగుడి)లో సప్తమ కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. సోమవారం నుంచి ప్రారంభమైన సప్తమ కల్యాణ ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పూజారి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

## విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో అజయ్‌బాబు

చినగంజాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్న పాఠశాలలో ఆ సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు, పాఠశాలల విద్యా కమిటీ ఛైర్మన్లు కృషి చేయాలని తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వం చేపట్టిన నూతన కార్యక్రమంపై పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యా కమిటీ ఛైర్మన్‌లకు బుధవారం మండల విద్యాశాఖాధికారి-1 అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నూతన కార్యక్రమంలో భాగంగా తరగతిగదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రైమరీ మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో అజయ్‌బాబు తెలిపారు. మండలంలో ఇప్పుడు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 37ఉండగా, అవి 38కి పెరిగినట్లు తెలిపారు. మండల పరిదిలో 12 మోడల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రణాళికలను తయారు చేసి ఉన్నాతాధికారులకు పంపినట్లు తెలిపారు. సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామం నుండి ఒక కిలోమీటరు దాటి పాఠశాలలో చేరిన విద్యార్థికి ప్రభుత్వం సంవత్సరానికి విద్యార్థి బ్యాంకు అకౌంట్లో ఆరు వేలరూపాయిలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి, మండల పరిధిలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్‌లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

దర్శి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 1వ వార్డులో ఆయన కమిషనర్ మహేశ్వరరావుతో కలిసి బుధవారం పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులు గృహాల మీదుగా వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. మురుగుకాల్వలు, సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. వెంటనే ఛైర్మన్ పిచ్చయ్య విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి గృహాలపై వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్లు, కాల్వలు నిర్మించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు యూపీ పాఠశాలలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్

### మూడు యూపీ స్కూళ్లు మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా ప్రతిపాదనలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ మండల విద్యా శాఖ అధికారులు జిల్లా అధికారులకు పంపిన ప్రతిపాదనలను ఆమోదించారు. సింగనపాలెం, పెదఉల్లగల్లు, సుంకరవారిపాలెం, శంకరాపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలను హైస్కూళ్లుగా మారుస్తున్నారు. అదేవిధంగా వేములబండ, తూర్పుకంభంపాడు, నాయుడుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లగా మారుస్తూ ప్రతిపాదనలను పంపించారు. వీటికి జిల్లా కలెక్టర్ ఆమోదముద్ర కూడా వేశారు. ఇక కేవలం విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులే వెలువడాల్సి ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి యూపీ పాఠశాలలుగా కొనసాగుతుండటంతో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారు. ఇటీవల యూపీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి హైస్కూళ్లుగా మార్చేందుకు విద్యా శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మేరకు వాటి ఫైళ్లు వేగంగా కదిలాయి. దీంతో వచ్చే విద్యా సంవత్సరానికి ఆ పాఠశాలలు హైస్కూళ్లుగా మారనున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ఆ పాఠశాలలను రద్దు చేస్తూ వాటి స్థానంలో మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు చేస్తున్నారు. దీంతో యూపీ పాఠశాలలు హైస్కూళ్ళగా ఏర్పాటు కానుండటంతో ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



## శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో బుధవారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా జరిగింది. మాఘ పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం సు ప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు నిర్వహించారు.అభిషేకం అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములు గా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉభయ దాతలు గా అద్దంకికి చెందిన కోనేటి వెంకటేశ్వర్లు, కుమారి, కళ్యాణ్, కళ్యాణి దంపతులు పాల్గొన్నారు. ఉభయదాతలను వేదపండితులు,పూజారులు ఆశీర్వదించారు.

# మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

- ఒక్క సర్పంచ్ కూడా హాజరుకాని వైనం
- అధికారులకు నోటీసులిస్తాం ఎంపీడీవో




సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ రజని, ఎంపీడీవో లక్ష్మీనారాయణ తదితర అధికారులు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం బుధవారం యద్దనపూడి మండల పరిషత్ కార్యాలయంలో మొక్కుబడిగా జరిగింది. సమావేశం జరిగేందుకు సరిపడా ఎంపీటీసీ సభ్యులు సభకు హాజరైనప్పటికీ మండలంలో ఉన్న 14 గ్రామాల సర్పంచ్‌లలో ఒక్కరు కూడా హాజరుకాలేదు. దాంతో గ్రామాలలో ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించేవారే లేరు. కొంతమంది వివిధ శాఖలకు అధికారులు కూడా సమావేశానికి డుమ్మాకొట్టారు. సమావేశానికి హాజరుకాని మండల అధికారులకు నోటీసులు జారీ చేస్తామని ఎంపీడీవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఇదిలావుండగా సమావేశానికి ఎంపీపీ పులగం రజని అధ్యక్షత వహించగా, మండల స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ హాజరయ్యారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ జాగర్లమూడి ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఏర్పాటుచేసి కాలనీ వాసులకు తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. అంతేగాకుండా తాగునీటి సమస్య ఉన్న గ్రామాల వివరాలను తెలియచేయాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు. యనమదల గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలో సైడు కాల్వలు, సిమెంటు రోడ్లు తదితర సమస్యలను తెలుసుకునేందుకు సర్వే చేసేందుకు ఎంపిక చేశామన్నారు. ఇంకా సమావేశంలో తహసీల్దారు కె రవికుమార్, ఎంఈవో గోపి, ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర తదితర అధికారులు హాజరయ్యారు.

## తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు తుది నిర్ణయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని సత్రం బడిని యూపీ పాఠశాలగా కొనసాగింపు, డౌన్‌గ్రేడ్‌గా చేసి మోడల్ ప్రాథమిక పాఠశాలగా చేసే విషయంపై తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఎంఈవో1 గంగాధర రావు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం అప్ గ్రేడా..డౌన్ గ్రేడా అనే కథనం ప్రచురితం కావడంతో విద్యాశాఖ అధికారులు స్పందించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సమీపంలో ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు ఉన్నందున సత్రం బడిలో 6, 7 తరగతులు చదువుతున్న 33 మంది విద్యార్థులను ఆయా హైస్కూల్స్‌లో చేర్పించి, మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్పు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రాథమికంగా నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్పు చేస్తే 5 తరగతులకు 5 గురు ఉపాధ్యాయులను కేటాయించే అవకాశం ఉందన్నారు. యూపీ పాఠశాలగా కొనసాగిస్తే విద్యార్థుల సంఖ్య 90 మంది మాత్రమే ఉన్నందున 1 నుంచి 8 తరగతులకు 4గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని మోడల్ స్కూల్‌గా ప్రతిపాదించడం జరిగిందని, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించిన తరువాతే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# సాగులో ఆధునిక పద్ధతులు పాటించండి

పంగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటసాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని చినమల్లవరం, పంగులూరు గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న శనగ, పొగాకు పంటలను పరిశీలించారు. శనగలో తుప్పు తెగులు నివారణ చర్యలు చేట్టాలని సూచించారు. భూ యజమానులకు ప్రభుత్వం 14 నెంబర్లతో కూడిన యూనిక్ ఐడీని ఇవ్వనున్నందున రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు గుర్తింపు నెంబరు పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శైలేష్, నవనీతం, అమృత, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : రైతులకు ఆధార్ కార్డు లాగే 14 అంకెలతో కూడిన యూనిక్‌ఐడిని అందిస్తామని మార్టూరు ఏడిఏ కెవి శ్రీనివాసరావు అన్నారు.ఆయన బుధవారం మండలంలోని బొబ్బేపల్లి,రాజుగారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ తో కూడిన పథకాలను అందించాలంటే ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలన్నారు.తద్వారా వారు ప్రభుత్వ పథకాల లబ్ధిపొందడానికి అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజిరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : పొలం ఉన్న ప్రతి రైతు గుర్తింపు కార్డును తీసుకోవాలని పర్చూరు వ్యవసాయ సహాయ సంచారకుడు ఎస్.మోహనరావు అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం పర్చూరు, ఉప్పుటూరు గ్రామాల్లోని రైతులకు ఎవో రామోహన్ రెడ్డి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పొలం ఉన్న రైతు విశిష్ట ఐడీ కార్డు తీసుకోవాలన్నారు. ఐడీ గుర్తింపు ఉన్న కార్డు దారులకు మాత్రమే వ్యవసాయ పథకాలు, రాయితీలు అందుతాయన్నారు. ఏవో రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పంట మార్పిడి విధానాన్ని అనుసరించకపోవడంవల్లే తెగుళ్లు సోకుతున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అర్హులైన రైతులకు రాయితీపై బిందు, తుంపర సేద్య పరికాలు అందిస్తున్నమని అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి అన్నారు. బుధవారం పట్టణం పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంటలను పరిశీలించిన ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు గుర్తింపు సంఖ్య తప్పని సరి అని, ప్రతి ఒక్కరు గుర్తింపు సంఖ్య కోసం సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ శేషారావు పాల్గొన్నారు.

## చీట్‌ఫండ్స్

(5వ పేజీ తరువాయి)


చిట్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేయాలి. అనుమతులు వచ్చాకే చిట్ నిర్వహించాలి. ఎంత చిట్‌ను నిర్వహిస్తే అంత మొత్తం డిపాజిట్.. లేదా బ్యాంక్ గ్యారంటీ దాఖలు చేయాలి. ప్రతి చిట్‌కు మూడు బ్యాంకు ఖాతాలను నిర్వహించాలి. చిట్ పొందిన సభ్యుడికి 25 రోజుల్లో బ్యాంకు ఖాతా ఒకటి నుంచి డబ్బు చెక్కు రూపంలో చెల్లించాలి. సభ్యుడు నిర్ణీత గడువులోపు డబ్బు స్వీకరించకపోతే ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో నిల్వ ఉంచాలి. ఏ నెలలో ఏ సభ్యుడు చిట్ పొందాడన్న వివరాలను చిట్ రిజిస్ట్రార్‌కు లిఖిత పూర్వకంగా తెలియపరచాలి. ఒక నెలలో ఇందుకు సంబంధించిన సమాచారం ఇవ్వని పక్షంలో సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలి. సభ్యుల నుంచి ఫిర్యాదులు లేని పక్షంలో డిపాజిట్ సొమ్మును చిట్ ముగిసిన తర్వాత సంస్థకు చెల్లించాలి. చిట్ సంస్థపై ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలి. లోపాలు ఉంటే చర్యలు తీసుకోవాలి. చిట్ సంస్థలపై రిజిస్ట్రేషన్‌శాఖలోని రిజిస్ట్రార్ పర్యవేక్షణ ఉండాలి. ప్రతి నెల సంస్థ సంబంధిత పత్రాలను దాఖలు చేస్తుందీ లేనిది పరిశీలించాలి. సభ్యులకు డబ్బు చెల్లింపులు ఎలా జరుగుతున్నాయన్న అంశాన్ని పరిశీలించాలి. అయితే ఈ నిబంధనలు ఏవీ ఎక్కడ కూడా అమలు కావడంలేదు. నరసరావుపేటలో ఓ చిట్ సంస్థ కాలపరిమితి పూర్తయిన మూడు నెలల వరకు సొమ్ము చెల్లించకపోవడంతో లేదు. వైద్యుడిగా ఉన్న ఆ సభ్యుడు చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా సంస్థపై చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి.

**భారీగా లాభాలు**

ప్రతి గ్రూప్ చిట్‌కు మొదటి నెల, మూడో నెల పాటను సంస్థ తీసుకుంటుంది. ప్రతి నెల 5 శాతం కమీషన్ వసూలు చేస్తోంది. ఉదాహరణకు 10 లక్షల చిట్‌కు రెండు నెలలకు రూ.20 లక్షలను సంస్థ తీసుకుంటుంది. ప్రతీ నెల కమీషన్ రూపంలో నెలకు రూ.50 వేలు వసూలు చేస్తుంది. రూ.10 లక్షల చిట్‌కు మొత్తంగా రూ.30 లక్షలు చిట్ సంస్థకు వస్తుంది. ఇంత భారీగా లాభాలు వస్తున్నాయి. ఒక సభ్యుడు 2వ నెల చిట్ పొందినట్లయితే ముగ్గురు వ్యక్తుల గ్యారంటీతో చిట్ సొమ్ము చెల్లిస్తారు. ఇక వేళ చిట్ తీసుకున్న సభ్యుడు నెలవారీగా సొమ్ము చెల్లించకుంటే గ్యారంటీ ఇచ్చిన వక్తుల నుంచి ఆ మొత్తాన్ని రాబట్టుకుంటారు. ఏ కోణంలో చూసినా చిట్ సంస్థకు నష్టాలు వచ్చే అవకాశం లేదు. అయినా రిజిష్టర్ పేరుతో అక్రమంగా చిట్లు నిర్వహిస్తూ మదుపరులను మోసగిస్తున్నారు. చిట్ సంస్థలు బోర్డు తిప్పేస్తుండటంతో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఏబీసీపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు

అద్దంకి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచి కెనాల్(ఏబీసీ) పై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో కొత్తగా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రోడ్డు రవాణా, భవనాల శాఖ నుండి 2 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు ఆర్ అండ్ బి రోడ్డు లో వల్లాపల్లి సమీపంలో అద్దంకి బ్రాంచి కెనాల్ పై సుమారు 6 దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి పూర్తి గా శిధిలావస్థ కు చేరింది. డబుల్ రోడ్డు గా విస్తరణ జరిగినప్పటికి బ్రిడ్జి వద్ద మా త్రం సింగిల్ వే గా ఉండటం తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి ఆర్‌అండ్‌బి శాఖ నుండి నిధులు మంజూరు చేయించారు. దీంతో అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు మండలాల ప్రజలకు కష్టాలు తీరనున్నాయి.ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు రోడ్డులో వల్లాపల్లి సమీపంలో ఎన్ఎస్‌పీ కాలువపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

## ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు

### గుంతలు పూడ్చుతున్న అధికారులు

దర్శి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా రోడ్లను గుంతలరహితంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే అధికశాతం రోడ్లకు మరమ్మతులు పూర్తయ్యాయి. కొన్నింటికి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని అసలు పట్టించుకోకపోవటంతో అన్నీరోడ్లు అధ్వానంగా మారిన విషయం తెలిసిందే. రాకపోకలకు ఇబ్బందిగా మారి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఇబ్బందులను గుర్తించి రోడ్లలో ఉన్న గుంతలను చదును చేసి నునుపుగా తీర్చిదిద్దుతున్నారు.

మండలంలోని తొమ్మిది ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేశారు. 65 కిలోమీటర్లు దూరం గుంతలు పూడ్చి, కంకర, తారు వేసి అభివృద్ధి చేసినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. ఈ పనులకు ఇప్పటి వరకు రూ.80 లక్షలు ఖర్చుచేశారు.

## చిన్నతరహా నీటి వనరుల గణనపై శిక్షణ

పర్చూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చిన్నతరహా నీటి వనరులు, జలాశయాల గణనపై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నీటి వనరులను ఏవిధంగా గణన చేయాలి, ప్రస్తుతం ఉన్న నీటి వనరుల పరిస్థితి తదితర అంశాలపై తహసీల్దార్ బ్రహ్మయ్య నేతృత్వంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. పర్చూరు, యద్దనపూడి మండలాల పరిధిలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ వీఏఎస్ కమలాకర్, డిప్యూటీ తహసీల్దార్ పి.సుధారాణి, ఏఎస్‌వో శ్రీమన్నారాయణ, ప్రేమకుమారి, వీఆర్వోలు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి కమలాకర్, తహసీల్దార్ బ్రహ్మయ్య

# లక్షలు వ్యయం.. అన్నీ నిరుపయోగం

- చీరాల నియోజకవర్గంలో పెద్దఎత్తున నిలిచిన ప్రభుత్వ భవనాలు
- బిల్లులు రాక కొన్ని, ప్రారంభం కాక కొన్ని
- సేవలు లేక మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం
- అందుబాటులోకి తేవాలని ప్రజల విజ్ఞప్తి







బిల్లులు రాక స్వల్ప పెండింగ్‌లతో నిలిచిన బోయినవారిపాలెం రైతు సేవా కేంద్రం... వినియోగంలో లేని దేవాంగపురి-2 సచివాలయం, దేవాంగపురి రైతు సేవా కేంద్రం

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో అరకొర నిర్మాణాల పెండింగ్‌తో కొన్ని, ప్రారంభానికి నోచుకోక కొన్ని ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. అత్యవసర సేవలంటూ, ప్రజల వద్దకే పాలనంటూ ఊదరగొట్టే ప్రచారాలతో గత ప్రభుత్వం ప్రజా సొమ్మును ఇష్టారీతిగా దుర్వినియోగం చేసింది. ఈక్రమంలోనే కాంట్రాక్టర్‌లకు భవనాల ఆశచూపి పనులు ప్రారంభించే విధంగా ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో శ్రద్ధ కనబరచలేదు. అయితే వైసీపీ పాలకుల కల్లబొల్లి మాటలు నిజమని నమ్మిన కాంట్రాక్టర్‌లు వడ్డీలకు అప్పులు తెచ్చిమరీ భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. ఈక్రమంలో కొందరయితే బేస్‌మెంట్ లెవల్లోనే చేతులు దులుపుకోగా, మరి కొందరు దాదాపుగా భవనాలనుపూర్తి చేశారు. అయితే అప్పట్లో కొందరికి బిల్లులు రాకపోవడంతో అధికారులకు తాళాలు ఇవ్వలేదు. మరి కొందరికి 5దశల్లో బిల్లులు రావాల్సి ఉండగా, రెండు దశల్లోనే ఆగిపోయాయి. దీంతో దాదాపుగా పూర్తయిన సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. చుట్టూ చిల్లచెట్లు, పిచ్చి మొక్కలతో అస్థవ్యస్థంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల భవనాలు మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు ఆవాసాలుగా మారాయి. భవనాల చుట్టూ చెత్తా చెదారాలు వివిధ రకాల వ్యర్థాలతో దారుణంగా కన్పిస్తున్నాయి. మరోవైపు కాంట్రాక్టర్‌లకు వడ్డీలు పెరిగి పోయి, బిల్లులు రాకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.

టీడీపీ కూటమి ప్రభుత్వమైనా బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కాంట్రాక్టర్‌లు వేడుకొంటుండగా, భవనాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



పూజలకు హాజరైన టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి వేణుగోపాల స్వామి దేవస్థానంలో పొగడదండ రవికుమార్ దంపతులచే శాంతి కల్యాణ హోమం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ హాజరయ్యారు. ఈక్రమంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి మహేంద్రనాథ్‌కు ఆశీస్సులు అందించారు. చీరాల యాదవపాలెంలో శ్రీ తిరుపతమ్మ గోపయ్య స్వామి 34వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మహేంద్రనాథ్ పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలకు బీరువా బహూకరణ

పంగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన పంచుమర్తి రాంబాబు బీరువాను బహూకరించారు. ఇదే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పంచుమర్తి రాంబాబు కుమార్తె భవ్యశ్రీ పోస్టర్ కాంపిటేషన్‌లో దేశస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి గ్రామానికి, పాఠశాలకు పేరు తెచ్చింది. భవ్యశ్రీ తండ్రి రాంబాబు బుధవారం బీరువాను హెచ్‌ఎం అణితకు అందచేశారు. రాంబాబును ఉపాధ్యాయులు అభినందించారు.

## చెత్త సంపద కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



వల్లాపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఎంపీడీవో కె.కుసుమకుమారి బుధవారం పరిశీలించారు. గ్రామానికి పరమడ వైపున ప్రభుత్వ భూమిలో చెత్త సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని గ్రామ పెద్దలు ఎంపీడీవోకి తెలియజేశారు. దీనిపై ఆమె స్థలాన్ని పరిశీలించి త్వరలో చెత్త సంపద కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలు లేని బల్లికురవ, చెన్నుపల్లి, కూకట్లపల్లి, వల్లాపల్లి గ్రామాలలో స్థలాలను సేకరించి వెంటనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

- గ్యాస్ సిలిండర్ పేలడంతో ఎగిసిపడిన మంటలు
- బూడిదైన నగదు, బంగారు ఆభరణాలు
- కారంచేడు మండలం ఆదిపూడిలో ఘటన



మంటల్లో కాలిపోతున్న ఇల్లు



కాలి బూడిదైన నగదు

ఆదిపూడి (పర్చూరు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన కారంచేడు మండలం ఆదిపూడి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మిరియాల శివమ్మ ఇంట్లో ఉదయం 9గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న గ్యాస్‌సిలిండర్ కూడా పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన సమాయాకి శివమ్మ పొలానికి వెళ్లగా, ఆమె తల్లి మరో చోటుకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చీరాల అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న పొలానికి వెళ్లిన మహిళ బూడిదైన ఇంటిని చూసిన బోరున విలపించింది. ఇంట్లో సామగ్రితోపాటు దాచుకున్న రూ.50వేల నగదు, 5 సవర్ల బంగారు ఆభరణాలు కాలిపోయాయని ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. సుమారు రూ.5లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలకు వంటపాత్రల అందజేత

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) వంటశాలకు అవసరమైన వంట సామగ్రిని బుధవారం అందజేశారు. రిటైర్డ్ హెచ్‌ఎం పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతుల రెండవ కుమారుడు తాండవకృష్ణ కుమార్తె మాహిమాన్విత పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకానికి అవసరమైన గ్యాస్ స్టవ్, పెద్ద వంట పాత్రను హెచ్‌ఎంపురుషోత్తంకు దాతలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీఎస్ఎస్ తార, ఎం.కోటేశ్వరరావు, కృష్ణరావు, ఎస్ఎంసీ బాధ్యులు పరిటాల నాగరాజు, సీఆర్పీ ఎం.రమేష్ పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

సంతమాగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విత్తన వ్యాపారం సాగక, అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొమ్మలపాడు గ్రామం వద్ద బుధవారం చోటుచేసుకుంది. అద్దంకి పట్టణం పనుమర్తిపాలెంకు చెందిన సిద్ధారపు సుబ్బారెడ్డి (50) అద్దంకి టౌన్‌లో విత్తనాల వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారం సాగక, అప్పులు ఎక్కువై మనస్థాపం చెంది, అద్దంకి నుంచి కొమ్మలపాడు గ్రామం కాలువ వద్దకు వచ్చి కూల్ డ్రింక్ బాటిల్‌లో పురుగుల మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుడు సిద్ధారపు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుండెపోటు నివారణ ఇంజక్షన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ శరత్‌కుమార్, వైద్యాధికారులు

## ఉచితంగా గుండెపోటు నివారణ ఇంజక్షన్

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వైద్యశాలలో మెరుగైన సేవలు అందించడంలో భాగంగా వేల రూపాయలు విలువ చేసే గుండె పోటు నివారణ ఇంజక్షన్‌ను ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా అందిస్తుందని దానిని రోగులు సద్వినియోగపర్చుకోవాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.శరత్‌కుమార్ అన్నారు. బుధవారం అద్దంకి సీహెచ్‌సీలో గుండెపోటు నివారణ ఇంజక్షన్‌కు సంబంధించి స్టెమీ గుండెకు భరోసా కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండెపోటు వచ్చే లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ శరత్‌కుమార్ వివరించారు. ఛాతీనొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. మొదటి గంట అత్యంత కీలకమని, ఇలాంటి లక్షణాలు ఉన్న వారిని 108 అంబులెన్స్ సాయంతో మొదటి గంటలోపు దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురావడం, ప్రథమిక పరీక్షల అనంతరం రూ.45వేల విలువైన ఈ ఇంజక్షన్‌ను రోగికి అందించి ప్రాణాలు కాపాడుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిత జ్యోతి, డాక్టర్ డి.ప్రదీప్తి, డాక్టర్ జి.మెర్సీ పీజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాలను అతివేగంగా నడిపితే చర్యలు

**ఆర్టీవో రామకృష్ణారెడ్డి**



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఆర్టీవో రామకృష్ణారెడ్డి, సిబ్బంది

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు అతివేగంగా పాఠశాలల సమీపంలో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పాఠశాలల వద్ద ప్రమాద ఘంటికలు కథనంపై ఆయన స్పందించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు పాఠశాలల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. అలాగే వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈక్రమంలో మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. అలాగే కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట తనిఖీ అధికారులు అంకమ్మరావు, కిషోర్‌బాబు, రవి నాయక్, సిబ్బంది ఉన్నారు.

## ఎస్పీని కలిసిన బులియన్ మర్చంట్ ప్రతినిధులు

**అదుపులో ఉన్న వ్యాపారికి తాత్కాలిక ఊరట**

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం చీరాల బంగారపు వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయమై చీరాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎస్పీ తుషార్‌డూడీని కలిశారు. ఈక్రమంలో తమ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న విషయాన్ని వివరించారు. దీంతో స్పందించిన ఎస్పీ స్థానిక అధికారులతో విషయంపై ఆరా తీశారు. ఈక్రమంలో బంగారం వ్యాపారి దేవకర్ శ్రీరంగపేట్‌కు తాత్కాలిక ఊరట లభించింది. అయితే సుమారు 14 కేసుల్లోని నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసుల విచారణ జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఆ కేసుల వెనుక ప్రముఖులను విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది.

## నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

సంతమాగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు ప్రాజెక్టు పరిధిలోగల అంగన్‌వాడీ కార్యకర్తలు 13 నుంచి 15వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సంతమాగులూరు ప్రాజెక్టు అధికారి సుధ తెలిపారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు, బల్లికురవ మండలం కొప్పెరపాడు జడ్పీ హైస్కూల్‌లో 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు ఉంటాయని సుధ తెలిపారు.



## వినియోగంలోకి గుంటుపల్లి ఎత్తిపోతల

- మంత్రి రవికుమార్ ఆదేశాలతో చోరీ అయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న మూడు గ్రామాల రైతులు




మరమమ్మతులు అనంతరం వినియోగంలోకి వచ్చిన గుంటుపల్లి ఎత్తిపోతల పథకం

బల్లికురవ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గత రెండేళ్ల నుంచి మరమ్మతులకు గురైన ఉన్న గుంటుపల్లి ఎత్తిపోతల పథకం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రత్యేక కృషితో ఎట్టకేలకు బుధవారం నుంచి వినియోగంలోకి వచ్చింది. రెండేళ్లగా నిరుపయెగంగా ఎత్తిపోతల పథకం ఉండడంతో పంటలకు సకాలంలో నీరు అందడం లేదు. దీంతో ఇటీవల నీటి సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్యను ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరారు. దీంతో అయన ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించగా అందులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయి ఉంది. మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ విషయాన్ని పేరయ్య మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పథకంలో మరమ్మతు లు చేసి నీటిని పంటలకు విడుదల చేస్తున్నారు. ఎంతో కాలంగా పనిచేయని ఎత్తి పోతల పథకం కూటమి ప్రభుత్వం రాగానే వినియోగంలోకి తీసుకురావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ గ్రామాలలో ఉన్న 12 వందల ఎకరాల భూములను నీరు అందుతుందని మొక్కజొన్నను రైతులు సాగు చేసి ఉన్నారని ఇప్పుడు పథకం వినియెగంలోకి రావడం పంటలకు ఉపయోగమని రైతులు అంటున్నారు.



కాలవలోకి వచ్చి చేరుతున్న ఎత్తిపోతల నీరు

## భక్తిశ్రద్ధలతో సాగరహారతి

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు సముద్ర తీరంలోని ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో బుధవారం రాత్రి హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సాగర హారతిని ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు విశేషంగా హాజరయ్యారు. కార్యక్రమంలో తాడివలస దేవరాజ్, జ్వాలా నరసింహం, వేద పండితులు కార్తీక్ శర్మ, నగేష్, సంఘ్ రాష్ట్ర నాయకులు అవ్వారు శ్రీనివాసరావు, ఆంజనేయశర్మ, నాగేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సాగర హారతిని ఇస్తున్న పురోహితుడు



స్టాకు వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి, డీటీ గీత

## రైస్ డిపోలపై కొనసాగుతున్న దాడులు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని అధికారులు రెండో రోజు రైస్ డిపోలపై దాడులు నిర్వహించారు. ఈక్రమంలో తహసీల్దార్ పార్వతి, సివిల్ సప్లయిస్ డీటీ గీత 13, 15 షాపులను తనిఖీ చేశారు. స్టాకు సక్రమంగా ఉన్నట్లు చెప్పారు. తరచూ దాడులు జరుగుతాయని, భిన్నంగా వ్యవహరిస్తే కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ మొయిన్

## నిబంధనల మేరకు రిసార్ట్స్ నిర్వహించాలి

**డీఎస్పీ ఎండీ మొయిన్**

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల మేరకు మాత్రమే రిసార్ట్స్ నిర్వహించాలని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. బుధవారం సముద్ర తీరంలోని రిసార్ట్స్ యజమానులు, నిర్వాహకులతో రూరల్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసంద్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కచ్చితంగా గజ ఈతగాళ్లతో నిర్వహణ సాగాలన్నారు. ప్రమాదాలు నియంత్రించాలంటే గజ ఈతగాళ్ల సాయం అవసరం ఉందన్నారు. అలాగే అనుమతులు లేకుండా క్యాంప్ ఫైర్ వంటివి నిర్వహించరాదన్నారు. రూములకు వచ్చిన వారి నుంచి అడ్రస్ ప్రూఫ్‌లు తప్పనిసరిగా సేకరించాలన్నారు. అనుమానుతుల వివరాలను వెంటనే అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రిసార్ట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## రేపు బూదవాడలో ఉచిత నేత్రవైద్య శిబిరం

పంగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవాడ గ్రామంలో ఈ నెల14న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నేత కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గొట్టిపాటి యూ త్ ఆధ్వర్యంలో కారంచేడు ఎల్‌వీ ప్రసాద్ నేత్రాలయం వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షకు వచ్చే వారు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని కోరారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

## జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ధర్మవరం పీఈటీ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వ్యాయమ ఉపాధ్యాయుడు యు.మధుబాబు ఎంపిక అ య్యారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి 43వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో ధర్మవరం జడ్పీహెచ్ఎస్ పీఈటీ పాల్గొని 4-100 మీటర్స్ రిలేలో గోల్డ్ మెడల్, 4-400 మీటర్స్ రిలేలో సిల్వర్ మెడల్, 1500మీటర్లు పరుగు పందెంలో కాంస్య మెడల్ సాధించాడు. మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు మధుబాబు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మధుబాబును జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ పి. శివశంకర్, ధర్మవరం జడ్పీహెచ్ఎస్ హెచ్‌యం యు. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శాలువతో సత్కరించి అభినందించారు.



పీఈటీ మధుబాబును అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు



బహుమతిని అందుకుంటున్న మధుబాబు